ప్రభుత్వ బడిని కాపాడుకోవాలి

- ఇందుకోసం ఉపాధ్యాయులందరూ పోరాడాలి
- పిఆర్‌సి కమిషనర్‌ను వెంటనే నియమించాలి
- ప్రాంతీయ సదస్సులో యుటిఎఫ్ నాయకులు
- యుటిఎఫ్ కర్నూలు జిల్లా కార్యాలయం ప్రారంభం

3

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 251 | విజయవాడ, సోమవారం 14 ఏప్రిల్ 2025 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 14 April 2025 | Rs

అదరగొట్టిన కోహ్లి, సాల్ట్

- రాజస్థాన్‌పై బెంగళూర్ గెలుపు

6

సమైక్యతా శంఖారావ సభలో అభివాదం చేస్తున్న ఇమ్రాన్ ఘడి, ప్రశాంత్‌భూషణ్, వడ్డే శోభనాద్రీశ్వరరావు, వి.శ్రీనివాసరావు, విజయరావు, అజీజ్‌పాషా, తులసిరెడ్డి తదితరులు

మతాన్ని పునాదిగా చేసుకునే ప్రభుత్వాల పతనం తప్పదు

సమైక్యతా శంఖారావ సభలో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మతాన్ని పునాదిగా చేసుకుని పాలన సాగించిన ప్రభుత్వాలు పతనం కాక తప్పదని చరిత్ర చెబుతుందని సమైక్యతా శంఖారావం సదస్సులో పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. మతోన్మాద చర్యలకు పాల్పడితే హిట్లర్‌కు పట్టిన గదే ప్రస్తుత పాలకులకు పడుతుందన్నారు. విజయవాడలోని పిబి సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో సొసైటీ ఫర్ కమ్యూనల్ హార్మోని ఆధ్వర్యంలో సమైక్యతా శంఖారావ సభ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అధ్యక్షత వహించారు. తొలుత మహాత్మాగాంధీ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే చిత్రపటాలకు వక్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజ్యసభ సభ్యులు ఇమ్రాన్ ప్రతాప్ ఘడి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టినప్పుడు 288 మంది మద్దతు ఇవ్వగా 232 మంది వ్యతిరేకించారన్నారు. వ్యతిరేకించిన వాళ్లు కేవలం ముస్లింలే కాదని, ఇతర అనేక మతాలు వారు ముస్లింలకు అండగా నిలిచారన్నారు. దీన్ని బట్టీ చూస్తే హిందువులు ఈ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలకు అండగా నిలిచినట్లు తెలిపారు. చంద్రబాబు నాయుడులో గతానికి, ప్రస్తుతానికి చాలా మార్పు కనిపిస్తోందని చెప్పారు. ఇప్పుడు ముస్లింలపై విషం చిమ్ముతున్నారని చెప్పారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం గద్దె దిగాలన్నా, వక్ఫ్ బిల్లు ఆమోదం పొందకుండా చెయ్యాలన్నా చంద్రబాబు, నితీష్ కుమార్‌లకు అవకాశం ఉందన్నారు. వీరు ముస్లింలకు వ్యతిరేకంగా, బిజెపి ప్రభుత్వానికి మద్దతుగా ఉన్నారని తెలిపారు. వక్ఫ్ బిల్లు నిలుపుదల చేసే వరకూ సమిష్టి పోరాటం చేద్దామన్నారు. బిజెపి తన సోషల్ మీడియా ఛానల్స్‌తో ప్రజల్లో విద్వేషాన్ని రెచ్చగొడుతుందన్నారు. మనకు ఉన్న సోషల్ మీడియా వేదికల్లో మంచిని పెంపొందించాలని పిలుపునిచ్చారు. ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ.. దేశంలో అనేక ధర్మాలు, భాషలు, మతాలు, కులాలు, సంప్రదాయాలు ఉన్నాయని, ఈ వైవిధ్యమే భారతదేశ బలమన్నారు. కొందరు దేశంలో ఒకే భాష, ఒకే మతం ఉండాలని చూస్తున్నారని తెలిపారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్‌లను వేరు చేయాలని చూస్తున్నారని చెప్పారు. ప్రతి జిల్లాలో ఒక కమ్యూనల్ హార్మోని సొసైటీ ఏర్పాటు చేయాలని, దీనిలో ప్రతి మతం వారిని సభ్యులుగా చేయాలని కోరారు. గతంలో హిట్లర్ విభజించి పాలించాలని చూసి నాశనం అయ్యాడని, వీరికి కూడా అదేగతి పడుతుందని చెప్పారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమంలో ఏ పాత్ర లేని, బ్రిటీష్ వాళ్లకు ఏజెంట్లుగా పనిచేసిన పార్టీ ప్రస్తుతం దేశాన్ని పాలిస్తుందని తెలిపారు. సరైన సమయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. ఈ శంఖారావం సదస్సు రాష్ట్ర ప్రజలందరినీ మతోన్మాదానికి వ్యతిరేకంగా సమైక్య పరిచి ముందుకు నడిపించే శక్తి, స్ఫూర్తిగా నిలవాలని కోరారు. కేంద్రం మిగతా 5లో

బాణసంచా కేంద్రంలో పేలుడు

8 మంది దుర్మరణం • మరో 8 మందికి తీవ్ర గాయాలు

అనకాపల్లి జిల్లాలో తీవ్ర విషాదం • సిఎం చంద్రబాబు సహా పలువురు దిగ్భ్రాంతి

ప్రజాశక్తి- కోటవురట్ల (అనకాపల్లి జిల్లా), అమరావతి బ్యూరో

అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నం గ్రామం వద్దగల బాణసంచా తయారీ కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం సంభవించిన భారీ పేలుడు అంతులేని విషాదాన్ని మిగిల్చింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందగా, మరో ఎనిమిది మందికి తీవ్రగాయాలయ్యాయి. వారిని మెరుగైన వైద్యం కోసం విశాఖలోని కెజిహెచ్‌కు తరలించారు. బాణసంచా తయారీలో జువ్వలకు భారీగా ప్రెజర్ ఇవ్వడంతో ఈ ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. ఘటనా స్థలంలో భీతావహ దృశ్యాలు కానవచ్చాయి. పేలుడు ధాటికి మృతదేహాలు తునాతునకలయ్యాయి. ఈ ప్రమాదం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు సహా పలువురు ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని సిపిఎం డిమాండ్ చేసింది. స్థానికుల కథనం ప్రకారం... కైలాసపట్నం గ్రామం వద్ద శ్రీలక్ష్మి ఫైర్ వర్క్స్ పేరిట బాణసంచా తయారీ కేంద్రం 30 ఏళ్లుగా నడుస్తోంది. సుమారు 30 మంది దీనిలో పనిచేస్తున్నారు. ఎప్పటిలాగే ఆదివారం వారంతా పనిలో నిమగ్నమైన సమయంలో పేలుడు

పేలుడు ధాటికి దూరంగా ఎగిరిపడ్డ మృతదేహం వద్ద కుటుంబీకురాలి రోదన

సంభవించింది. ఈ ఘటనలో కోటవురట్ల మండలం కైలాసపట్నం గ్రామస్తులు అప్పికొండ తాతబ్బాయి (50), పురం పాప (40), గుంపిన వేణుబాబు (40), రాజుపేటకు చెందిన సంక్రాంతి గోవింద (45), దాడి రామలక్ష్మి (38), చౌడువాడకు చెందిన సేనాపతి బాబూరావు (50), విశాఖపట్నానికి చెందిన మనోహర్ (32), కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన దేవర నిర్మల (38) దుర్మరణం చెందారు. శ్రీలక్ష్మి ఫైర్ వర్క్స్ నిర్వాహకుడు మడగల జానకీరామ్, కార్మికులు జల్లూరి నాగరాజు, వెల్లంకి సంతోషి, వెల్లంకి సాహూ, వెల్లంగి రాజు, సింహాద్రి గోవింద, సేనాపతి శ్రీను, గుంపిన సూరిబాబు తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా కోటవురట్ల మండలం కైలాసపట్నం, కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందినవారు. వీరిని తొలుత నర్సీపట్నం ఆస్పత్రికి, ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం విశాఖలోని కెజిహెచ్‌కు తరలించారు.

మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా : మంత్రి అనిత

నర్సీపట్నం ఆస్పత్రిలో క్షతగాత్రులను హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పరామర్శించారు. కైలాసపట్నంలోని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాద కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు రూ.15 లక్షలను ప్రభుత్వపరంగా ఎక్స్‌గ్రేషియో కింద ఇస్తున్నట్టు ప్రకటించారు. క్షతగాత్రులకు మిగతా 5లో

నేడు 98 మండలాల్లో వడగాడ్పులు

- మరో 11 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు
- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం 98 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని, మరో 11 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈ మేరకు ఆదివారం ఆ సంస్థ ఎండి రోణంకి కూర్మనాథ్ ఒక ప్రకటన విడుదల చేశారు. తీవ్ర వడగాడ్పులు వీచే మండలాల్లో కాకినాడ 3, అంబేద్కర్ కోనసీమ 7, తూర్పుగోదావరి జిల్లాలో గోకవరం మండలంలో తీవ్ర వడగాడ్పులు వీస్తాయని తెలిపారు. ఆదివారం 54 మండలాల్లో 40 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు సోమవారం శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, కాకినాడ, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, తూర్పుగోదావరి, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు.

'ఉపాధి హామీ'లో లోపాలెన్నో!

- స్వతంత్ర సర్వేకు పార్లమెంటరీ ప్యానెల్ సిఫార్సు

న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్) ప్రభావాన్ని, లోపాలను తెలుసుకోవడానికి స్వతంత్ర సర్వే నిర్వహించాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ (గ్రామీణాభివృద్ధి) సిఫార్సు చేసింది. కార్మికుల సంతృప్తి, వేతనాల్లో జాప్యం, భాగస్వామ్య ధోరణులు, పథకంలోని ఆర్థిక అవకతవకలు.. వంటి అంశాలపై ఈ సర్వే నిర్వహించాలని కమిటీ సూచించింది. ఇటీవల ముగిసిన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల చివరి రోజున అంటే ఈ నెల 4న ఈ కమిటీ నివేదికను ప్రవేశపెట్టారు. ఈ కమిటీకి కాంగ్రెస్ ఎంపి సప్తగిరి శంకర్ ఉలక అధ్యక్షుడిగా ఉన్నారు. అవసరమైన విధాన సంస్కరణలపైనా సర్వే నిర్వహించాలని ప్యానెల్ పేర్కొంది.

ఉపాధి హామీలో ఎస్‌సి, ఎస్‌టి, మహిళా కార్మికుల భాగస్వామ్యం దేశవ్యాప్తంగా సంతృప్తికరంగా లేదని ప్యానెల్ విమర్శించింది. వీరు సమాన పని అవకాశాలు, ప్రయోజనాలు పొందేలా అధ్యయనం నిర్వహించాలని కోరింది. మారుతున్న కాలం, ముందుకొస్తున్న కొత్త సవాళ్లను దృష్టిలో ఉంచుకుని చట్టాన్ని పునరుద్ధరించాల్సి ఉందని సూచించింది. ప్రస్తుతం హామీ ఇచ్చిన పనిదినాల సంఖ్యను 100 రోజుల నుంచి 150 రోజులకు పెంచాలని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖను కమిటీ కోరింది.

వేతన చెల్లింపుల్లో దీర్ఘకాల జాప్యం

వేతన చెల్లింపుల్లో దీర్ఘకాల జాప్యం ఉపాధి హామీని పట్టిపీడిస్తుందని, దీనివల్ల కార్మికులు అనిశ్చితిలో ఉంటున్నారని పార్లమెంటరీ ప్యానెల్ పేర్కొంది. వేతనాల జాప్యానికి ప్రస్తుతం చెల్లిస్తున్న పరిహారాన్ని పెంచాలని సిఫార్సు చేసింది. కార్మికుల్లో నమ్మకాన్ని కొనసాగించడానికి, అంతరాయం లేకుండా పనులు చేయడానికి సకాలంలో వేతనాలు చెల్లించడం చాలా అవసరమని కమిటీ పేర్కొంది.

అటకెక్కిన అమర్‌జిత్‌సిన్హా ప్యానెల్ నివేదిక

ఉపాధిహామీలో లోపాలను ముఖ్యంగా అంతర్-రాష్ట్ర వైవిధ్యాలను సమీక్షించడానికి కేంద్రం ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖ మాజీ కార్యదర్శి అమర్‌జిత్ సిన్హా నేతృత్వంలో కేంద్రం 2022లో నియమించిన ప్యానెల్ 2023లో నివేదికను సమర్పించింది. ఆ ప్యానెల్ సూచనలు ఇంకా అమలు కాలేదు. హామీ ఇచ్చిన పనిదినాలు, వేతనాల ప్రయోజనాలు కార్మికులకు అందడం లేదని అమర్‌జిత్ సిన్హా ప్యానెల్ విమర్శించింది. తమిళనాడు వంటి ఆర్థికంగా మెరుగైన రాష్ట్రాలతో పోలిస్తే బీహార్‌వంటి ఎక్కువ పేదరికం ఉన్న రాష్ట్రాల్లో పెడుతున్న వ్యయం చాలా తక్కువగా ఉందని తెలిపింది.

సిసోడియాకు స్థానచలనం

- 8 మంది ఐఎఎస్‌ల బదిలీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం 8 మంది సీనియర్ ఐఎఎస్ అధికారులను బదిలీ చేసింది. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు విడుదల చేశారు. ఐఎఎస్‌ల బదిలీల్లో కొంతమంది గత కొంత కాలంగా పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న వారు కూడా ఉన్నారు. ప్రస్తుతం రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న ఆర్‌పి సిసోడియా, చేనేత జౌళి పరిశ్రమల మంత్రిత్వశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ అయ్యారు. సిసిఎల్‌ఎ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పనిచేస్తున్న జయలక్ష్మికి రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. ఐటి కార్యదర్శిగా పనిచేస్తున్న భాస్కర్ కాటంనేనికి ఎపిహెచ్‌ఆర్‌డిఐ డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనరుగా ముత్యాల రాజును ప్రభుత్వం నియమించింది. రైతు బజార్ల సిఇఒగా కె మాధవీలత, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ కార్యదర్శిగా ఎం గౌతమి, ఆయుష్ డైరెక్టర్‌గా కె దినేష్‌కుమార్, ఎపి ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఎమ్‌డిగా కె నీలకంఠారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

దేశానికే ఆదర్శంగా మంగళగిరి ఆస్పత్రి

- ఏడాదిలోగా పనులు పూర్తి : శంకుస్థాపనలో మంత్రి లోకేష్

ప్రజాశక్తి- మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా మంగళగిరి వంద పడకల ప్రభుత్వాస్పత్రిని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. మంగళగిరి సమీపంలోని చినకాకాని వద్ద వంద పడకల ప్రభుత్వ వైద్యశాలకు మంత్రి ఆదివారం శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. వైవిసి (యార్లగడ్డ వెంకన్న చౌదరి) కేన్సర్ ఆస్పత్రికి 1984లో ఎన్‌టి రామారావు శంకుస్థాపన శిలాఫలకం వద్ద సెల్ఫీ దిగారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా మంగళగిరి ఆస్పత్రిని తీర్చిదిద్దుతామన్నారు. జోనింగ్, స్టాఫింగ్, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని, ఆర్థో, డయాలసిస్ సెంటర్‌ను అందుబాటులోకి తెస్తామని, తలసేమియా, డీ అడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆస్పత్రి పనులను ఏడాదిలో పూర్తి చేసే బాధ్యత ఎపిఎంఎస్‌ఐడిసి చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావుపై ఉందని, వంద పడకల ఆస్పత్రి సాధన కమిటీ సభ్యుల పర్యవేక్షణలో నిర్మాణం జరగాలని, నాణ్యతలో ఎక్కడా రాజీపడకుండా నిర్మిస్తామని తెలిపారు. మంగళగిరి స్వచ్ఛతతోపాటు అన్ని రంగాల్లో నంబర్ ఒన్ కావడానికి ప్రజల సహకారం కావాలని అన్నారు.

ఆస్పత్రి నమూనాల వద్ద ప్రజారోగ్య వేదిక, ఇతర అధికారులు, నాయకులతో మంత్రి లోకేష్

3,005 మందికి పట్టాల పంపిణీ

మంగళగిరి, తాడేపల్లి మండలాల్లో 3,005 మందికి తొలి విడతగా శాశ్వత పట్టాలను మంత్రి లోకేష్ పంపిణీ చేశారు. మంగళగిరి సమీపంలోని డాన్ బాస్కో స్కూలు ఆవరణలో ఐదు రోజులపాటు చేపట్టిన పట్టాల పంపిణీ ఆదివారం ముగిసింది. రత్నాల చెరువులో 729 మందికి, మహానాడు-1లో 473, మహానాడు-2లో 441, యర్రబాలెంలో 274, కొలనుకొండలో 235, పెనుమాకలో 185, పద్మశాలి బజార్‌లో 137, డ్రైవర్స్ కాలనీలో 119, నీరుకొండలో 99, సలాం సెంటర్‌లో 92, ఉండవల్లిలో 82, ఉండవల్లి సెంటర్‌లో 85, సీతానగరంలో 48, ఇప్పటంలో పది మందికి పట్టాలను అందించారు.

టిడ్కో కాలనీలో వాటర్ ప్లాంట్ ప్రారంభం

మంగళగిరి పట్టణం టిడ్కో కాలనీలో వెయ్యి లీటర్ల సామర్థ్యంతో దివీస్ లేబొరేటరీస్ సంస్థ ఏర్పాటు చేసిన ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్‌ను లోకేష్ ప్రారంభించారు. వాటర్ క్యాన్‌ను నీటితో నింపి మహిళలకు అందజేశారు. కార్యక్రమాల్లో మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎపిఎంఎస్‌ఐడిసి చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టిటిడి బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకీదేవి, తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సిన్హా తదితరులు పాల్గొన్నారు.

'వక్ఫ్' నిరసనలపై లాఠీ

- అస్సాంలో పలువురికి గాయాలు
- బెంగాల్ ముర్షిదాబాద్‌లో మరో 12 మంది, మధ్యప్రదేశ్‌లో తొమ్మిదిమంది అరెస్టు

న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకొచ్చిన వక్ఫ్ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా దేశంలోని పలు ప్రాంతాల్లో నిరసనలు, ఆందోళనలు పెల్లుబుకుతున్నాయి. అస్సాంలో తాజాగా జరిగిన నిరసనపై పోలీసులు లాఠీలతో విరుచుకుపడ్డారు.

వక్ఫ్ (సవరణ) చట్టాన్ని వ్యతిరేకిస్తూ అస్సాంలోని కాచర్ జిల్లా సిల్చార్ పట్టణంలో ఆదివారం భారీర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని బెరెంగా ప్రాంతంలో తాజా చట్టాన్ని రద్దు చేయాలంటూ నల్ల జెండాలు పట్టుకుని వందలాదిమంది నిరసన తెలిపారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వాల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ర్యాలీకి అనుమతి లేదని చెబుతూ పోలీసులు ర్యాలీని

వక్ఫ్ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న నిరసనకారులను అడ్డుకుంటున్న అస్సాం పోలీసులు

అడ్డుకోవడానికి ప్రయత్నించారు. తరువాత లాఠీలతో విరుచుకుపడ్డారు. దీంతో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ శనివారం విలేకరులతో మాట్లాడుతూ వక్ఫ్ (సవరణ) బిల్లుకు వ్యతిరేకంగా జరిగే ఎలాంటి ఆందోళననైనా పోలీసులు అణచివేస్తారని చెప్పారు.

ముర్షిదాబాద్‌లో మరో 12 మంది అరెస్టు

పశ్చిమ బెంగాల్ ముర్షిదాబాద్ జిల్లాలో వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా జరిగిన అల్లర్ల కేసులో మరో 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు. దీంతో అరెస్టులు 150కి పెరిగినట్లు సీనియర్ పోలీసు అధికారి ఒకరు ఆదివారం వెల్లడించారు. హింసాకాండ ప్రభావిత ప్రాంతాల్లో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్‌ఎస్‌ఎస్) సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు విధించామని, ఇంటర్నెట్‌ను నిలిపివేశామని చెప్పారు.

మరో ఐదు కంపెనీల బలగాల తరలింపు

ముర్షిదాబాద్‌కు మరో ఐదు కంపెనీల బలగాలను తరలించినట్లు సరిహద్దు మిగతా 5లో

11 మంది పోలీసుల సస్పెన్షన్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాజీ ఎంపి గోరంట్ల మాధవ్‌కు ఎస్కార్టుగా ఉన్న ఒక సిఐ, ఇద్దరు ఎస్‌ఐలు, మరో తొమ్మిది మంది పోలీసులను సస్పెండ్ చేస్తూ గుంటూరు జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. స్పెషల్ బ్రాంచ్ సిఐ బి.సీతారామయ్యను విఆర్‌కు పంపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంగా అరండల్‌పేట సిఐ వీరాస్వామి, పట్టాభిపురం ఎస్‌ఐ రాంబాబు, నగరంపాలెం ఎస్‌ఐ రామాంజనేయులు, ఎఎస్‌ఐలు ఆందోని, ఏడుకొండలు, నగరంపాలేనికి చెందిన ఐదుగురు కానిస్టేబుళ్లు, అరండల్‌పేటలోని ఒక కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. వైఎస్ భారతిపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన టిడిపి కార్యకర్త చేబ్రోలు కిరణ్‌ను అరెస్టు సందర్భంగా పోలీసు వాహనాన్ని అడ్డుకున్నారన్న అభియోగాలతో గోరంట్ల మాధవ్‌తో సహా మరో ఐదుగురిని అరెస్టు చేశారు. అనంతరం వైద్య పరీక్షల నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా మాధవ్ పోలీసుల అనుమతి లేకుండా ఫోన్‌లో మాట్లాడారని, అధికారులపై దురుసుగా మాట్లాడినా ఉదాశీనంగా వ్యవహరించారని, మీడియా ముందుకు మిగతా నిందితులతోపాటు వచ్చేందుకు మాధవ్ నిరాకరించినా ఏమీ చేయలేకపోయారనే కారణాలతో డిఎస్‌పిని విఆర్‌కు పంపి మిగతా వారిని సస్పెండ్ చేశారు.

కేరళలో ఎస్‌ఎఫ్‌ఐ 18వ అఖిల భారత మహాసభ

- కోజికోడ్ వేదికగా జూన్ 27 నుంచి 30 వరకు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేరళలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) 18వ అఖిల భారత మహాసభ జరగనుంది. ఈ మేరకు ఆదివారం ఎస్‌ఎఫ్‌ఐ ఆలిండియా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూఖ్ బిశ్వాస్ ప్రకటన విడుదల చేశారు. కేరళలోని కోజికోడ్ వేదికగా జూన్ 27 నుంచి 30 వరకు జరగనున్న ఈ మహాసభ చారిత్రాత్మకం కాబోతుందని తెలిపారు. 2003లో 11వ అఖిల భారత మహాసభ కోజికోడ్‌లో జరిగిందని, మళ్లీ 22 ఏళ్ల తరువాత కోజికోడ్‌లో 18వ అఖిల భారత మహాసభ జరగనుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి దాదాపు 730 మంది ప్రతినిధులు, పరిశీలకులు హాజరవుతారని తెలిపారు. గత మూడేళ్లలో విద్యా రంగ పరిరక్షణకు, మోడీ ప్రభుత్వం విద్యా వ్యతిరేక విధానాలను, నూతన విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ చేపట్టిన ఉద్యమాలు, సంఘం విస్తరణ వంటి అంశాలపై మహాసభలో సమీక్షిస్తామన్నారు. గత మహాసభ తీసుకున్న కర్తవ్యాల అమలుపై చర్చిస్తామన్నారు. గత 17వ మహాసభ 2022 డిసెంబర్‌లో హైదరాబాద్‌లో జరిగిందని, అప్పటి నుంచి ఇప్పటి వరకు విద్య కేంద్రీకరణ, ప్రైవేటీకరణ, కాషాయికరణ, కార్పొరేటీకరణపై ఎస్‌ఎఫ్‌ఐ నిర్వహించిన సమరశీల పోరాటాలను చర్చిస్తామని తెలిపారు.

అఖిల భారత మహాసభకు లోగో ఆహ్వానం

ఎస్‌ఎఫ్‌ఐ 18వ అఖిల భారత మహాసభకు సంబంధించి లోగోలను ఆహ్వానిస్తున్నామని విపి సాను, మయూఖ్ బిశ్వాస్ తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ కేంద్ర కార్యనిర్వాహక కమిటీ మహాసభ అధికారిక ప్రచారానికి లోగోను ఆహ్వానిస్తుందన్నారు. లోగోలను ఈ నెల 20లోపు officeficec@gmail.com మెయిల్‌కు పంపొచ్చన్నారు. దేశవ్యాప్తంగా వచ్చిన డిజైనర్లు పంపిన లోగోల్లో ఒకదాన్ని ఎంపిక చేస్తామన్నారు.

తిరుమలకు చేరుకున్న పవన్ కల్యాణ్ సతీమణి

ప్రజాశక్తి-తిరుమల

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సతీమణి అన్నా లెజినోవా తిరుమలకు చేరుకున్నారు. ఆదివారం సాయంత్రం గాయత్రి నిలయం వద్ద ఆమెకు టిటిడి అధికారులు స్వాగతం పలికారు. ఈ క్రమంలో డిక్లరేషన్‌పై ఆమె సంతకం చేశారు. రాత్రికి ఆమె తిరుమలలోనే బస చేశారు. ఇటీవల సింగపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో తన కుమారుడు మార్క్ శంకర్ సురక్షితంగా బయటపడడంతో సోమవారం తిరుమల శ్రీవారిని స్వామివారిని దర్శించుకుని మొక్కు చెల్లించనున్నారు. ఇందుకు టిటిడి అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

'సహకార' బలోపేతానికి రెండంచెల విధానం

- ఎపిసిసిబిఇఎ వజ్రోత్సవ వేడుకల్లో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సహకార రంగంలో బ్యాంకుల బలోపేతం, గ్రామీణ వ్యవసాయ రంగం ప్రయోజనాల కోసం రెండంచెల విధానం ప్రవేశపెట్టాలని, ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని వక్తలు కోరారు. గ్రామీణ వ్యవసాయ మౌలిక సౌకర్యాల కల్పన కోసం రూ.2.50 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. విజయవాడలోని ఎంబివికెలో ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎపి సిసిబిఇఎ) వజ్రోత్సవ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, వేడుకల ఆహ్వాన సంఘం ఛైర్మన్ కె రామకృష్ణ స్వాగతోపన్యాసం చేస్తూ.. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్పొరేట్లకు అనుకూలంగా 4 కార్మిక కోడ్‌లు కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొస్తున్న నేపథ్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాలకు ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. పాలకవర్గాలు అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గం, రైతాంగం ఐక్యంగా తిరుగు బావుటా ఎగుర వేస్తున్న నేపథ్యంలో ఉత్సవాలు నిర్వహించుకున్నట్లు చెప్పారు. ఆప్కాబ్ పూర్వ ఛైర్మన్ టిడి జనార్ధన్ మాట్లాడుతూ.. సహకార రంగాభివృద్ధికి, ఉద్యోగుల శ్రేయస్సుకు తాను కట్టుబడి ఉంటానని, రెండంచెల విధానం అమలుకు కృషి చేస్తానని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఐబిఇఎ జాతీయ ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటాచలం, ఎపి, తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బిఎస్ రాంబాబు, ఆప్కాబ్ పూర్వ ఛైర్మన్లు విజయేందర్ రెడ్డి, మల్లెల ఝాన్సీరాణి, ఎపిసిసిబిఇఎ నాయకులు కెవిఎస్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల్లోకి వస్తున్నా.. జగన్ అక్రమాలు వెలికితీస్తా

- రిటైర్డ్ డిజిపి ఎబి

ప్రజాశక్తి-అమలాపురం, ముమ్మిడిరం

తన జీవితంలో కాళ్లూ, చేతులూ ఆడినంత కాలం సమాజం కోసం పని చేస్తానని తాను ఉద్యోగ విరమణ సమయంలో చెప్పానని, ఆ మాట ప్రకారం రాజకీయాల్లోకి వస్తున్నానని రిటైర్డ్ డిజిపి ఎబి వెంకటేశ్వరరావు తెలిపారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో, అమలాపురంలో ఆయన ఆదివారం పర్యటించారు. ముమ్మిడివరం మండలం ఠానేలంకలో వైఎస్.జగన్‌పై దాడి కేసులో బెయిల్‌పై ఉన్న నిందితుడు జనుపల్లి శ్రీనుతోపాటు ఆయన కుటుంబ సభ్యులను వెంకటేశ్వరరావు పరామర్శించారు. శ్రీనుతో మాట్లాడి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంకటేశ్వరరావు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైఎస్ జగన్ బాధితులకు న్యాయం చేయడానికి తన పోరాటం మొదలైందని తెలిపారు. అందులో భాగంగానే జనుపల్లి శ్రీనుకు సహకారం అందించేందుకు వచ్చానని చెప్పారు. అక్రమాలు చేసే వారికి జగన్ పెద్దపీట వేస్తారని, తన స్వార్థం కోసం ప్రజలను కులాలు, వర్గాలుగా విభజిస్తారని విమర్శించారు. జగన్ అక్రమాలు, అన్యాయాలను బయట పెడతానని, జగన్ బాధితులకు అండగా ఉంటానని తెలిపారు. తాను పార్టీలకు అతీతంగా పోరాటం చేస్తున్నానని, ఈ న్యాయ పోరాటం విజయవంతం చేయడానికి ప్రజల మద్దతు కావాలని కోరారు.

రోజుకు 20 గంటలు డ్యూటీ!

- కనీస వేతనం, చట్టబద్ధ హక్కులు కరువు
- ఎలక్ట్రికల్ ఎసి బస్సుల కాంట్రాక్టు డ్రైవర్ల వెతలు

కాంట్రాక్టు డ్రైవర్ల ఫొటో (ఫైల్)

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

వారు పనిచేసేది ఎసి బస్సుల్లో. వారి జీవితాలు మాత్రం కష్టాల కొలిమే. రోజుకు 20 గంటల వరకూ పని చేయాల్సి వస్తోంది. ఆ తర్వాత ఒక రోజు సెలవు ఇచ్చినా ఆ మరుసటి రోజు మళ్లీ అన్నే గంటలు వారితో పని చేయించుకున్నారు. రోజుకు 20 గంటలపాటు నెలలో 15 రోజులు పనిచేస్తే వారికి నెలకు వచ్చే వేతనం రూ.20 వేలు మాత్రమే. నెలకు 180 గంటలు పని చేయాల్సి ఉండగా, దాదాపు 300 గంటలకుపైన వెట్టిచాకిరీ చేయాల్సి వస్తోంది. యూనిఫాం, గుర్తింపు కార్డులు, ఇఎస్ఐ, పిఎఫ్‌లు వంటి చట్టబద్ధమైన హక్కులేవీ వారికి అమలు కావడం లేదు. తిరుమల శ్రీవారి పాదాల చెంత అలిపిరి డిపోలో ఎలక్ట్రికల్ ఎసి బస్సుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు డ్రైవర్ల దీనగాథ ఇది.

తిరుపతి రీజియన్ పరిధిలో అలిపిరి డిపో నుంచి మాత్రమే ఎలక్ట్రికల్ ఎసి బస్సులు తిరుగుతున్నాయి. మొత్తం వంద బస్సులు ఉన్నాయి. వీటిలో 50 బస్సులను తిరుపతి-తిరుమల మధ్య, తిప్పుతున్నారు. మిగిలిన బస్సులను తిరుపతి నుంచి శ్రీకాళహస్తి, తిరుపతి నుంచి నెల్లూరు నాన్‌స్టాఫ్ సర్వీసులుగా నడుపుతున్నారు. తిరుపతిలోని అలిపిరి నుంచి తిరుమలకు తిరుగుతున్న ఈ బస్సుల్లో పనిచేస్తోన్న కాంట్రాక్టు డ్రైవర్లు కట్టుబానిసలుగా పనిచేయాల్సి వస్తోంది. తెల్లవారుజామున మూడు గంటలకు డ్యూటీకి హాజరైతే రాత్రి 11 గంటలకు డ్యూటీ దిగుతున్నారు. అలిపిరి నుంచి తిరుమలకు రోజుకు ఐదు ట్రిప్పులు తప్పనిసరిగా తిరగాలి. వెనువెంటనే ఈ బస్సులకు అనుమతిస్తే 12 నుంచి 14 గంటల్లో వీటి డ్యూటీ పూర్తవుతుంది. అయితే, ఈ బస్సులను వెనువెంటనే అనుమతించకపోవడం, బ్యాటరీ ఛార్జింగ్‌కు గంటల సమయం పడుతుండడంతో నిర్దేశించిన ట్రిప్పులు పూర్తి కావడానికి 20 గంటల వరకూ సమయం పడుతోందని డ్రైవర్లు వాపోతున్నారు. 1,960 మోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యాక్ట్ ఛాప్టర్ 1లో సెక్షన్ 1, 2 ప్రకారం 12 గంటలు మాత్రమే పనిచేయాల్సి ఉన్నప్పటికీ అదనంగా ఎనిమిది గంటల వరకూ విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఆదాయం అంతా బస్సు యజమాన్య సంస్థ మెగా' కంపెనీకి వెలుతోంది. ఆర్‌టిసి అలిపిరి డిపో మేనేజర్‌కు నిర్వహణ బాధ్యత మాత్రమే ఉంటోంది. ఎలక్ట్రానిక్ వాహనాలకు ఇన్స్యూరెన్స్ ఉన్నప్పటికీ ఏదైనా అద్దం పగిలినా, బస్సు డ్యామేజీ అయినా బీమా క్లెయిమ్ చేసుకోవచ్చు. అయితే, డ్రైవర్లకు ఇచ్చే అరకొర జీతంలోనే కాంట్రాక్టర్ సంస్థ కోత పెడుతోంది.

అగ్రిమెంట్ ప్రకారం పనిచేయాల్సిందే

మెగా సంస్థతో ఎలక్ట్రికల్ బస్సు డ్రైవర్లు కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం పనిచేయాల్సిందే. ఇఎస్ఐ, పిఎఫ్ ఆ సంస్థే చూసుకుంటుంది. జీతభత్యాల బాధ్యత వారిదే. మాకు ఏ సంబంధమూ లేదు. మమ్మల్ని మాత్రం నిర్వహణ బాధ్యత చూసుకోమని చెప్పారు. ఆ ప్రకారమే మేం పనిచేయించుకుంటున్నాం. రోజుకు ఐదు ట్రిప్పులు ఎంత త్వరగా పూర్తయితే అంత త్వరగా ఇళ్లకు వెళతారు.

-సింగం హరిబాబు, డిపో మేనేజర్, అలిపిరి

పనిగంటలు తగ్గించి జీతం పెంచాలి

అలిపిరి డిపో పరిధిలో పనిచేస్తున్న ఎలక్ట్రికల్ ఎసి బస్సు కాంట్రాక్టు డ్రైవర్ల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. రోజుకు 20 గంటల వరకూ పని చేయించుకుంటున్నారు. ఇస్తున్న తక్కువ జీతం కూడా పదో తేదీ తర్వాతే చెల్లిస్తున్నారు. ఆర్‌టిసి యాజమాన్యం, ప్రభుత్వం జోక్యం చేసుకుని వారికి న్యాయం చేయాలి. పని గంటలు తగ్గించి జీతం పెంచి సకాలంలో చెల్లించాలి.

-జి.బాలసుబ్రమణ్యం, ఎలక్ట్రికల్ బస్సు కాంట్రాక్టు వర్కర్ల యూనియన్ తిరుపతి జిల్లా గౌరవాధ్యక్షులు

ప్రభుత్వ శాఖలన్నిటిలోనూ డ్రోన్ సేవలు

- డ్రోన్ కార్పొరేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని శాఖల్లోనూ డ్రోన్ సేవలు వినియోగించనున్నట్లు డ్రోన్ కార్పొరేషన్ వెల్లడించింది. గనులు, పురపాలక, రెవెన్యూ, అటవీ, ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్, పర్యావరణం, నీటిపారుదల, వ్యవసాయ, హోంశాఖ, దేవాదాయశాఖతోపాటు అనేక శాఖల్లో సేవలు వినియోగించుకునేందుకు కసరత్తు మొదలుపెట్టినట్లు కార్పొరేషన్ వర్గాలు వెల్లడించాయి. ఓర్వకల్లులో డ్రోన్ సిటీలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపే సంస్థలు, యూస్‌కేసెస్ అభివృద్ధికి సంబంధించిన ఔత్సాహికులు, ఔత్సాహిక సంస్థలు ఎంపానల్‌మెంట్ కోసం తమ ప్రతిపాదనలను ఈ నెల 21లోగా ఎపి డ్రోన్ కార్పొరేషన్‌కు ఆన్‌లైన్ ద్వారా అందజేయాలని ఆ సంస్థ కోరింది. వివరాలు, ప్రతిపాదనల సమర్పించేందుకు www.apsfl.in/notifications.php వెబ్‌సైట్‌ను లేదా వాట్సాప్ నెంబరు 7995511440 ద్వారా సంప్రదించాలని డ్రోన్ కార్పొరేషన్ కార్యాలయం పేర్కొంది.

ముఖ్యమంత్రితో ఆత్మకూరు దళిత కుటుంబాలు భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతల దాష్టీకాలకు గురయ్యామని పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం, ఆత్మకూరుకు చెందిన దళిత కుటుంబాలు ఉండవల్లిలోని సిఎం చంద్రబాబును ఆదివారం కలిశాయి. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి నేతృత్వంలో సిఎంను కలిసి గత ప్రభుత్వ హయాంలో తాము పడ్డ కష్టాలను దళిత కుటుంబాలు వివరించాయి. 2019-24 మధ్య గ్రామంలోని 127 ఎస్‌సి కుటుంబాలు.. వైసిపి నేతల దాడులు, దౌర్జన్యాలకు గురయ్యాయని తెలిపారు. గ్రామాల్లో ఉండనివ్వకుండా ఆనాటి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రోత్సాహంతో వైసిపి నేతలు తమను వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలు కాపాడుకోవడానికి ఐదేళ్లపాటు గ్రామాలు వదిలివెళ్లి తలదాచుకున్నట్లు ముఖ్యమంత్రికి తెలిపారు. తాము ఊరిలో లేకపోవడంతో ఇళ్లు కూడా ధ్వంసం చేశారని పేర్కొన్నారు. పార్టీ కోసం ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటానని సిఎం భరోసానిచ్చారు. వైసిపి బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. వైసిపి నేతలు ధ్వంసం చేసిన ఇళ్లకు మరమ్మతులు చేయిస్తామని, ఇళ్లు లేని వారికి స్థలం కేటాయించి ఇంటిని నిర్మించి ఇస్తామన్నారు. పాడి, పౌల్ట్రీ పరిశ్రమ ఏర్పాటు చేసి శాశ్వత జీవనోపాధి కల్పిస్తామన్నారు. చదువుకున్న యువకులకు శిక్షణ ద్వారా నైపుణ్యాలు పెంచి ఉద్యోగావకాశాలు పొందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆత్మకూరులో తప్పకుండా పర్యటిస్తానని సిఎం అన్నారు. అనంతరం ఎస్‌సి వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవడంతో పాటు అసెంబ్లీలో బిల్లు ఆమోదింపజేసినందుకు ముఖ్యమంత్రికి వారు ధన్యవాదాలు తెలిపారు.

ప్రజా ప్రతినిధుల పనితీరుపై ఆరా

- మంత్రుల, సీనియర్ ఐఎఎస్‌ల పేషీలపై నిఘా
- రేపు కేబినెట్‌లో చర్చకు వచ్చే అవకాశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా ప్రతినిధులు ముఖ్యంగా మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై నిఘా వర్గాలు, థర్డ్ పార్టీ సర్వే బృందాల ద్వారా ప్రభుత్వం ఆరా తీస్తోంది. దీంతో తమపై ఎటువంటి ఆరోపణలు, ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయోమోననే ఆందోళన ప్రజా ప్రతినిధుల్లో నెలకొంది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు కావడం, మే నెలలో కడపలో మహానాడు నిర్వహించాలని ఇప్పటికే టిడిపి ప్రకటించింది. ప్రజా ప్రతినిధుల పనితీరు ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని, ప్రజాక్షేత్రంలో వారానికి మూడు రోజులైనా పర్యటిస్తూ ప్రజలతో మమేకం కావాలని టిడిపి అధిష్టానం పలుమార్లు తెలిపింది. అయినప్పటికీ శాసన సభ్యుల్లో పెద్దగా కదలిక కనబడటం లేదని నిఘా వర్గాలు పేర్కొంటున్నట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు 175 మంది ఎమ్మెల్యేల్లో సుమారు 40 నుంచి 50 మంది పనితీరు బాగాలేదని నిఘా వర్గాలతోపాటు థర్డ్ పార్టీ సర్వే బృందాలు ప్రభుత్వానికి నివేదిక అందించినట్లు తెలిసింది. ఆయా ఎమ్మెల్యేలు ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్యం, ఇసుక, భూ మాఫియా, రియల్ ఎస్టేట్ మాఫియాల్లో వేలు పెట్టినట్లు సర్వేల్లో బయటపడినట్లు సమాచారం. పలు ప్రాంతాల్లో మైనింగ్ మాఫియా, కాంట్రాక్టర్ల నుంచి పర్సంటేజుల వసూళ్లు చేస్తున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. మొత్తమ్మీద మంత్రులు, ఎమ్మెల్యేల్లో అత్యధిక శాతం మంది పనితీరు 35 నుంచి 40 శాతం కూడా దాటలేదని తెలిసింది. ప్రజా ప్రతినిధుల పనితీరు, ర్యాంకింగ్‌లు, పనితీరు మార్పు గురించి ఈ నెల 15న జరగనున్న కేబినెట్ సమావేశం అనంతరం మంత్రులకు సిఎం చంద్రబాబు ప్రత్యేకంగా మాట్లాడే అవకాశాలు మెండుగా ఉన్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా వైసిపి నేతలతో కొందరు ఎమ్మెల్యేలు ఇప్పటికీ సఖ్యతగా వ్యవహరిస్తూ తెలుగు తమ్ముళ్లు ఆశించిన స్థాయిలో పని చేయడం లేదనే విమర్శలు కూడా వినబడుతున్నాయి. ఇప్పటికే తిరువూరు ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాస్‌ను రెండు, మూడు సార్లు పార్టీ కేంద్ర కార్యాలయానికి పిలిపించి సంజాయిషీ అడిగిన విషయం తెలిసిందే.

అలాగే మంత్రులు, సీనియర్ ఐఎఎస్‌లు, ముఖ్యంగా ప్రిన్సిపల్ సెక్రటరీ, సెక్రటరీ స్థాయి ఉన్నతోద్యోగుల పేషీలపై ప్రభుత్వం నిఘా పెట్టినట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికీ కొందరు అధికారుల పేషీల నుంచి వైసిపి నేతలకు కీలక సమాచారం వెళుతోందనే అభిప్రాయం ప్రభుత్వ వర్గాల్లో బలంగా వ్యక్తమవుతోంది. ఈ మేరకు మంత్రుల పేషీలకు సంబంధించి హోంశాఖ మంత్రి అనిత ప్రైవేట్ పిఎ, మరో మంత్రి కొల్లు రవీంద్ర ఓఎస్‌డిని తొలగించినట్లు సమాచారం. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు పేషీ ఉద్యోగులపై కూడా కొన్ని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే ప్రిన్సిపల్ సెక్రటరీ కేడర్‌లో ఉండేవారి డిపార్టుమెంటల్ పేషీల్లో పనిచేసే కొందరు కాంట్రాక్టు ఉద్యోగులు ఐఎఎస్‌ల పేరుతో వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అక్కడ పనిచేసే ఉద్యోగులను ఇతర విభాగాలకు సర్దుబాటు చేస్తారనే ప్రచారం జరుగుతోంది.

బిఆర్ అంబేద్కర్ స్మృతివనం నిర్వహణకు పిపిపి మోడ్ వద్దు : సిపిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయవాడలోని పిడబ్ల్యుడి గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్మృతి వనాన్ని పిపిపి పద్ధతిలో నిర్వహించాలన్న ఆలోచనను ఉపసంహరించు కోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం లేఖ రాశారు. ఈ ప్రక్రియకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ప్రకటన జారీ చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఈ ఆలోచన సామాజిక స్ఫూర్తికి పూర్తి విఘాతం కలిగిస్తుందని పేర్కొన్నారు. విజయవాడ ప్రజలందరికీ ఉపయోగపడుతున్న పిడబ్ల్యుడి గ్రౌండ్‌ను అంబేద్కర్ స్మృతి వనంగా తయారుచేసిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలందరూ వచ్చి స్మృతి వనాన్ని సందర్శించి ముగ్ధులవుతున్నారని తెలిపారు. విజయవాడలో ఇటువంటి పర్యాటక ప్రదేశం మరొకటి లేదన్నారు. దీనిని ప్రభుత్వం మరింత అభివృద్ధి చేసి, థియేటర్, ఆడిటోరియం, బుక్‌స్టాల్స్, ఇతర సౌకర్యాలు కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తే విజయవాడ నగరానికి తలమానికంగా ఉంటుందన్నారు. అంతేకానీ ప్రభుత్వ ఆస్తిని ప్రైవేటు వారికి అప్పజెప్పడమంటే స్మృతి వనాన్ని పూర్తిగా కమర్షియల్ ప్రయోజనాలకు ఉపయోగించటమే అవుతుందన్నారు. ప్రజలకు ఉపయోగపడే స్మృతి వనాన్ని ప్రైవేటుపరం చేయాలనే ఆలోచన సరైంది కాదన్నారు. వెంటనే అటువంటి ఆలోచన విరమించుకోవాలని సిఎంను కోరారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్మృతి వనం నిర్వహణకు శాశ్వత నిధిని ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నడపాలని, ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీని అభివృద్ధి కోసం రాజకీయ పార్టీలు, సామాజిక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

'ఉక్కు' పరిరక్షణ పోరాటం చారిత్రాత్మకం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవడం కోసం 1522 రోజులుగా పోరాటం చేస్తున్న విశాఖ ఉక్కు కార్మికుల మనోధైర్యం, పోరాట పటిమ వెలకట్టలేనివని, ఈ పోరాటం చారిత్రాత్మకమైనదని సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని ఆయన ఆదివారం సాయంత్రం సందర్శించారు. ఉక్కు పరిరక్షణ పోరాటానికి మద్దతు తెలుపుతూ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్లాంట్‌కు ప్యాకేజీ ప్రకటించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని తెలిపారు. ప్రయివేట్ వ్యక్తులకు అమ్మడానికి ముందు స్టీల్‌ప్లాంట్‌కు ఎలాంటి అప్పులూ లేవని చూపించేందుకే ఈ ప్యాకేజీని ప్రకటించారన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయించకపోవడం దారుణమన్నారు. ప్లాంట్ పరిరక్షణ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మోడీతో మాట్లాడాలని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ కోసం యువకునిగా ఉన్నప్పుడు పోరాడిన వెంకయ్యనాయుడు ఇప్పుడు మాట్లాడాల్సిన అవసరముందన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ దేశంలోనే అత్యధికంగా ఉపాధి అవకాశాలు కల్పించిన స్టీల్‌ప్లాంట్‌లోని కార్మికులు నేడు అర్ధాకలితో పని చేయాల్సి వస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్, పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

కార్మిక వర్గానికి తీరని ద్రోహం

ఐఎల్‌టిడి వర్కర్స్ రాష్ట్ర మహాసభలో ఎవి నాగేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యాంత్రీకరణ పెంచి కార్మికుల శ్రమ శక్తిని పెద్దయెత్తున దోపిడీ చేస్తున్న పెట్టుబడిదారులకు కొమ్ముకాసి కార్మిక వర్గానికి మోడీ ప్రభుత్వం తీరని ద్రోహం చేస్తోందని ఎపి ఫెడరేషన్ ఆఫ్ ఐఎల్‌టిడి కంపెనీ వర్కర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎవి నాగేశ్వరరావు విమర్శించారు. ఫెడరేషన్ 15వ రాష్ట్ర మహాసభ విజయవాడలోని ఎంబివికెలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పని గంటలు వారానికి 90 గంటలకు పెంచాలని పెట్టుబడిదారులు తెస్తున్న ఒత్తిడికి మోడీ ప్రభుత్వం సలాం కొడుతోందన్నారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి మాట్లాడుతూ.. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, లేబర్ కోడ్స్ పేరుతో కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా మార్చేందుకు చేస్తున్న కుట్రలను అందరూ సంఘటితంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మే 20న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఐఎల్‌టిడి చీరాల బ్రాంచి కార్యదర్శి సుధీర్ మాట్లాడుతూ.. పోరాటాల ఫలితంగా చీరాలలో ఏడేళ్ల కిందట నిలుపుదల చేసిన రెండో లైన్ పనిని మొదలుపెట్టడంతో సుమారు 400 మంది కార్మికులకు పనిని సాధించామన్నారు. అనపర్తి బ్రాంచి కార్యదర్శి శామ్యూల్ మాట్లాడుతూ.. కార్మికులందరూ ఐక్యంగా నడవాలన్నారు. సిఐటియు బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్, ఎం వసంరావు, ఫెడరేషన్ నాయకులు, రాజమండ్రి ఏరియా నాయకులు జి రామచంద్రరావు తదితరులు ప్రసంగించారు. తొలుత గత 14వ మహాసభ నుంచి నేటి వరకూ జరిగిన కార్యకలాపాల నివేదికను ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎవి నాగేశ్వరరావు మహాసభలో ప్రవేశపెట్టారు. కోశాధికారి పఠాన్ కాలేషా జమా ఖర్చుల నివేదికను ప్రవేశపెట్టారు. బొయిన పోతురాజు, కొట్టు సూర్యనారాయణ, పఠాన్ కాలేషా అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు.

నూతన కమిటీ ఎన్నిక

ఎపి ఐఎల్‌టిడి నూతన కమిటీని ఈ సందర్భంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా గోసాల సుధాకర్, అసోసియేట్ అధ్యక్షులుగా సిహెచ్ శివరాజు, ప్రధాన కార్యదర్శిగా కె ధనలక్ష్మి, కోశాధికారిగా పఠాన్ కాలేషాతో పాటు మరో 20 మంది ఆఫీస్ బేరర్స్‌గా, 37 మంది కమిటీ సభ్యులుగా మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

రాజ్యాంగ పరిరక్షణకు అందరూ కలిసి పోరాడాలి

సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి పిలుపు

రాజ్యాంగ పరిరక్షణ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఆర్.నారాయణమూర్తి, వేదికపై కె.లోకనాథం, తదితరులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

రాజ్యాంగ పరిరక్షణకు అందరూ కలిసి కట్టుగా పోరాడాలని సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగానికి విరుద్ధంగా పనిచేస్తున్న పాలకులు కేంద్రంలో ఉన్నారని, వారి విధానాల వల్ల తీవ్ర నష్టం కలుగుతోందని, ముున్ముందు ఇది మరింత తీవ్రం కానుందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవలసిన అవసరముందని తెలిపారు. అందుకోసం సెక్యులర్, ప్రజాస్వామ్య శక్తులు కలిసి పోరాడాల్సిన అవసరముందని పేర్కొన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా కెవిపిఎస్, ప్రజానాట్య మండలి సంయుక్త ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ సమ్మేళనం కార్యక్రమం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ దేశంలోని అన్ని మతాలు, అన్ని కులాలు, అన్ని తరగతుల వారు ఉన్నత స్థితికి చేరుకోవడం కోసం దోహదపడే విధంగా అంబేద్కర్ రాజ్యాంగ రచన చేశారన్నారు. ఎన్నికల్లో గెలవడం కోసం ఓట్లను కొనుగోలు చేయడం అప్పట్లోనూ ఉందని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో పోటీ చేసిన అంబేద్కర్‌ను ఓడించడం కోసం ప్రత్యర్థులు ఓటుకు రూ.10 చొప్పున ఖర్చు చేశారని చెప్పారు. ఆయన్ని పార్లమెంటులోకి రాకుండా రెండుసార్లు అడ్డుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఆయన మరొక రాష్ట్రం నుంచి పోటీ చేసి పార్లమెంట్‌లో ప్రవేశించి న్యాయశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. పురుషులతో సమానంగా స్త్రీలకు సమాన హక్కులు కల్పించాలని ఆయన ప్రయత్నించగా నాటి పాలకులు అడ్డుపడ్డారన్నారు. ఈ చర్యతో ఆయన న్యాయశాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారని తెలిపారు. దేశ సంపదను నేడు అదాని, అంబాని, మిట్టల్ వంటి వారికి దోచిపెడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటుపరం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగం పటిష్టంగా ఉంటేనే రాజ్యాంగ రక్షణ సాధ్యమని స్పష్టం చేశారు. ఇది జరగాలంటే కమ్యూనిస్టులు ఐక్యం కావాలని సూచించారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం దళితులు, మైనారిటీలు, కవులు, కళాకారులపైనా దాడులు చేస్తోందన్నారు. ప్రశ్నించే వారి గొంతు నొక్కుతోందని వివరించారు. కార్మిక చట్టాలను మార్చివేసి ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రయివేటీకరణ చేస్తోందన్నారు. చదువుకున్న యువతకు ఉద్యోగాలు లేకుండా చేసి నిరుద్యోగాన్ని పెంచుతోందని తెలిపారు. మోడీ పాలనతో రాజ్యాంగానికి ప్రమాదం వచ్చిందని తెలిపారు. రాజ్యాంగం ఉంటేనే ప్రజలకు రక్షణ ఉంటుందన్నారు. అంబేద్కర్ చెప్పిన విధంగా ప్రజలను సమీకరించడం, బోధించడం, పోరాడటం చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. సభ ప్రారంభంలో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి రాజ్యాంగ పీఠిక చదివి అందరితో ప్రమాణం చేయించారు.

ఆకట్టుకున్న ర్యాలీ, కళారూపాలు

రాజ్యాంగ పరిరక్షణ సమ్మేళనంలో భాగంగా తొలుత విశాఖలోని అంబేద్కర్ విగ్రహం నుంచి అల్లూరి విజ్ఞాన కేంద్రం వరకూ ర్యాలీ నిర్వహించారు. దీన్ని ఆర్.నారాయణమూర్తి జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు. డప్పుల వాయిద్యాలు, మహిళల కోలాటం, తీన్మార్‌తో సాగిన ర్యాలీ అందరినీ ఆకట్టుకుంది. అనంతరం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కళారూపాల ప్రదర్శనలు, నాటికలు ఆలోచింపజేశాయి.

వెంటాడుతున్న ప్రమాదాలు

(ఫైల్)

- ఇప్పటికే ఫార్మా పరిశ్రమల్లో పలు ఘటనలు
- తాజాగా బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు
- అనకాపల్లి జిల్లాలో పలుచోట్ల అనధికార కేంద్రాలు

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

కారణమేదైనా, తయారీ ఏదైనా లోపభూయిష్టమైన పర్యవేక్షణతో అనకాపల్లి జిల్లాలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫార్మా పరిశ్రమల్లో ప్రమాదాల ఘటనలు మరవక ముందే అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో ఆదివారం బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు సంభవించి ఎనిమిది మంది మృతి చెందడంతో ఒక్కసారిగా జిల్లా ప్రజలు ఉలిక్కిపడ్డారు. 2015లో ఎస్.రాయవరం మండలం గోకులపాడులో ఏడుగురు, 2022లో సబ్బవరం మండలం చిన్నయాతపాలెంలో ముగ్గురు దుర్మరణం చెందారు. బాణసంచా తయారీ కేంద్రాల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా ప్రమాద నివారణ చర్యలు, నియంత్రణ పద్ధతులు పాటించడం లేదు. బాణసంచా వ్యాపారం లాభసాటిగా ఉండడంతో కొంతమంది తయారీ కేంద్రాలకు అనుమతులు తీసుకుంటున్నారు. అయితే. అనుమతుల జారీకి ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పరిశీలించడంలో అధికార యంత్రాంగం వైఫల్యం కొట్టిచ్చినట్లు కనబడుతోంది. రెవెన్యూ, కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక శాఖ, విద్యుత్ భద్రత వంటి పలు అంశాలను తరచూ పర్యవేక్షించాల్సి ఉంది. తమకున్న పలుకుబడితో అనుమతులు ఇవ్వడమే తప్ప, దాని నిర్వహణపై అధికారులు కనీస పర్యవేక్షణ చేయడం లేదు. ఫలితంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బాణసంచా తయారీలో పొటాషియం, నైట్రేట్, సల్ఫర్ వంటి పేలుడు లక్షణాలు ఉన్న రసాయనాలను వినియోగిస్తున్నప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. వెంటిలేషన్ ఉండాలి. రసాయనాల మిశ్రమంలో సరైన శిక్షణ కార్మికులకు ఇవ్వకుండా పనిలో పెట్టుకోవడం కూడా ప్రమాదాలకు దారి తీస్తోంది. అనకాపల్లి జిల్లాలోని కశింకోట, కొత్తకోట, రాంబిల్లి, యలమంచిలి, నర్సీపట్నం, ఎస్.రాయవరం, సబ్బవరం ప్రాంతాల్లో అనధికారికంగా బాణసంచా కేంద్రాలు నడుస్తున్నాయి. స్థానిక పోలీసు, రెవెన్యూ అధికారులతో ఉన్న సంబంధాలతో వాటి నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఊరికి దూరంగా పొలాలు, కొబ్బరి తోటల్లో షెడ్లు ఏర్పాటు చేసుకొని ఈ తరహా కేంద్రాలు నిర్వహిస్తున్నారు. పేలుడు పదార్థాల చట్టం 1884 ప్రకారం రూపొందించిన నియమాలను నిర్వాహకులు పాటించడం లేదు. తయారీ లైసెన్సు, నిల్వ లైసెన్సు, విక్రయం, రవాణా వంటి లైసెన్సులు తీసుకోవాల్సి ఉన్నా ఆ నిబంధనలు పాటించకుండానే బాణసంచా వ్యాపారం సాగిస్తున్నారు.

ఫార్మా పరిశ్రమల్లో ప్రమాదాల్లో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ ఆరుగురు మృతి

ఫార్మా పరిశ్రమల్లో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ జరిగిన ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందారు. అచ్యుతాపురం సెజ్‌లోని వివిధ కంపెనీల్లో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు కార్మికులు, విష్ణు కెమికల్‌లో ఒకరు, పరవాడలోని విశాఖ ఫార్మా సిటీలో శాంపిల్స్ సేకరిస్తుండగా ల్యాబ్ టెక్నీషియన్ మరణించారు. అనేక కంపెనీల్లో జరిగిన ప్రమాదాలతో ఇతర రాష్ట్రాలకు చెందిన కాంట్రాక్టు కార్మికులు గాయపడ్డారు. యాజమాన్యాలు భద్రత ప్రమాణాలు పాటించకపోవడం, కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వకపోవడంతో ప్రమాదాల పాలయ్యారు.

ప్రభుత్వ బడిని కాపాడుకోవాలి

- ఇందుకోసం ఉపాధ్యాయులందరూ పోరాడాలి
- పిఆర్‌సి కమిషనర్‌ను వెంటనే నియమించాలి
- ప్రాంతీయ సదస్సులో యుటిఎఫ్ నాయకులు
- యుటిఎఫ్ కర్నూలు జిల్లా కార్యాలయం ప్రారంభం

యుటిఎఫ్ జెండా ఆవిష్కరణ ...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ప్రభుత్వ బడిని కాపాడుకోవాలని, అందుకు ఉపాధ్యాయులందరూ పోరాడాలని, పిఆర్‌సి కమిషనర్‌ను వెంటనే నియమించాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ కోరారు. యుటిఎఫ్ కర్నూలు జిల్లా ప్రారంభోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ముందుగా సి క్యాంప్ సెంటర్ నుంచి యుటిఎఫ్ భవన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం యుటిఎఫ్ పతాకాన్ని వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. జిల్లా కార్యాలయాన్ని ప్రసాద్ ప్రారంభించారు. అనంతరం యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె సురేష్ కుమార్ అధ్యక్షతన విద్యా రంగ సవాళ్లు- కర్తవ్యాలుపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాలకవర్గ ప్రయోజనాల కోసమే విద్యా రంగంలో సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. ఉపాధ్యాయులంటే పాఠాలు చెప్పేవారు కాకుండా ఇతర పనులు చేసే వారిగా మార్చేశారని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే జిఒ 117 రద్దు చేస్తామని పాదయాత్రలో నారా లోకేష్ హామీ ఇచ్చారని, దాన్ని రద్దు చేయకుండా ప్రత్యామ్నాయం కోసం కసరత్తు చేస్తున్నారని తెలిపారు. 2018లో 38 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో ఉంటే ఈ ఏడాదికి ఆ సంఖ్య 32.61 లక్షలకు తగ్గిందన్నారు. పాఠశాలలు, విద్యార్థులు లేకుండా ఉపాధ్యాయులు ఉండరని, పిల్లల హక్కుల మీద ఉపాధ్యాయుల హక్కులు ఆధారపడి ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ బడిని కాపాడుకుంటేనే నైతిక, రాజ్యాంగ విలువలుంటాయని తెలిపారు. ప్రపంచ బ్యాంకు నిబంధనలకు అనుగుణంగా సాల్ట్, ఎన్ఇపి తీసుకొచ్చారని అన్నారు. సంస్కరణలు ప్రయివేటీకరణను పెంచుతాయని, అవి జరగకుండా కాపాడుకోవాలని తెలిపారు. సమాంతర మీడియంను కొనసాగించాలని, ప్రతి పంచాయతీలో ఐదు తరగతులు, ఐదుగురు ఉపాధ్యాయులతో మోడల్ ప్రయిమరీ పాఠశాలలను ఏర్పాటు చేయాలని, అందులో ఏ పాఠశాలనూ మ్యాప్ చేయకూడదని డిమాండ్ చేశారు. విద్యారంగ సంస్కరణలు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేలా ఉండాలని, లేకుంటే తల్లిదండ్రులతో కలిసి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

పిఆర్‌సి, ఆర్థిక బకాయిల సాధన - కర్తవ్యాలపై ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో 20 శాతం మందికే అన్ని ప్రయోజనాలూ అందుతున్నాయన్నారు. 2022లో నష్టదాయకమైన రివర్స్ పిఆర్‌సి చేశారని, ఆశించిన ప్రయోజనాలు రాకుండా ప్రతి దానిలో కోత పెట్టారని చెప్పారు. ఆ అసంతృప్తితోనే ఆ పార్టీని ఓడించారన్నారు. బకాయిలన్నీ ఇచ్చాకే పిఆర్‌సి వేస్తే బాగుంటుందని నాయకులు చెబుతున్నారని, ఇప్పుడు పిఆర్‌సి కమిషన్ వేస్తే అది అందేందుకు కనీసం రెండేళ్లు పడుతుందని తెలిపారు. వెంటనే 12వ పిఆర్‌సి కమిషనర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానం కావాలంటే 29 శాతం ఫిట్‌మెంట్ కావాలని, అందుకోసం 29 శాతం ఐఆర్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు జయచంద్రారెడ్డి, లక్ష్మీరాజ, కర్నూలు జిల్లా అధ్యక్షులు యుఆర్‌ఎ రవి కుమార్, ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి, రాష్ట్ర పూర్వ గౌరవాధ్యక్షులు నరసింహులు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎంవి రమణయ్య, సుబ్బారెడ్డి, పూర్వ సహాధ్యక్షులు నాగమణి, పూర్వ కార్యదర్శి కోటేశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

- మరో 11 మందికి గాయాలు
- వారిలో ఇద్దరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - పరిగి

మృతురాలు అలివేలమ్మ

మృతురాలు ఆదిలక్ష్మి

ఆటోను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ముగ్గురు మృతి చెందారు. మరో 11 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలం ధనాపురం సమీపంలో కొడికొండ చెక్ పోస్ట్- సిరా జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు, మృతుల బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీసత్యసాయి జిల్లా రొద్దం మండలం దొడగట్టకు చెందిన 14 మంది హిందూపురం సమీపంలోని కొట్టి చౌడేశ్వరి దేవస్థానంలో శనివారం రాత్రి భజన చేసి ఆదివారం తెల్లవారుజామున తిరిగి స్వగ్రామానికి బయలు దేరారు. పరిగి మండలం ధనాపురం సమీపంలోని జాతీయ రహదారి 544లో వారు ప్రయాణిస్తున్న ఆటోను వెనుకవైపు నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో దొడగట్ట గ్రామానికి చెందిన అలివేలమ్మ (45), ఆదిలక్ష్మమ్మ (65), సాకమ్మ (60) అక్కడికక్కడే మృతి చెందారు. విజయ్, సుజాత, అభి, బబ్లు, ప్రమీలమ్మ, అంజిరెడ్డి, రూప, యశ్వంత్ కుమార్, అంజినమ్మ, ఆటోబాబు, పాపమ్మ గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. స్థానిక ఎస్ఐ రంగడుయాదవ్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి గురైన వారందరూ వ్యవసాయ కార్మికులే. వారి కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు, పలు రాజకీయ పార్టీల నాయకులు కోరారు. హిందూపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని హిందూపురం ఎంపి బికె పార్థసారథి, మున్సిపల్ చైర్మన్ డిఇ రమేష్ తదితర నాయకులు పరామర్శించారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ

తప్పిపోయిన ఐదేళ్ల బాలుడిని తల్లిదండ్రుల వద్దకు చేర్చిన సంఘటన తిరుపతి వెస్ట్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతికి చెందిన శంకర్ గణేష్, తన భార్యతోనూ, కుమారుడు దక్షిత కుమార్ (5)తోనూ కలిసి శ్రీకోదండ రామస్వామి తెప్పోత్సవాలను తిలకించేందుకు వచ్చారు. స్వామివారి పుష్కరణ వద్ద బాలుడు తప్పిపోయాడు. దీంతో శంకర్ గణేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పి వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు తిరుపతి వెస్ట్ సిఐ మురళీమోహనరావు తన సిబ్బందితో కలిసి బాలుడిని పది నిమిషాల్లోనే కనిపెట్టి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో పోలీసులు సిబ్బందిని ఎస్పి అభినందించారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి-భోగాపురం(విజయనగరం జిల్లా)

మొగసాల శ్రావణి (ఫైల్)

ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించలేకపోయానన్న మనస్తాపంతో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన విజయనగరం జిల్లా భోగాపురం మండలం ముంజేరు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. భోగాపురం ఎస్ఐ పాపారావు తెలిపిన వివరాల ప్రకారం. ముంజేరు గ్రామానికి చెందిన మొగసాల శ్రావణి (19) విశాఖపట్నం జిల్లా తగరపువలసలోని ఓ ప్రయివేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. శనివారం వెలువడిన ఫలితాల్లో ఆమె ఫెయిల్ అయ్యారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన విద్యార్థిని ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. విద్యార్థిని తండ్రి రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పాపారావు తెలిపారు.

టిటిడి గోశాలలో గోవుల మృతిపై అసత్య ప్రచారం

- టిటిడి చైర్మన్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

తిరుమల గోశాలలో ఇటీవల వంద గోవులు మృతి చెందాయంటూ టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కుట్రపూరితంగా ఉన్నాయని టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు విమర్శించారు. గోశాలను మీడియా, అధికారులతో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. అనంతరం బిఆర్ నాయుడు మాట్లాడుతూ ఎక్కడో మృతి చెందిన గోవుల ఫొటోలను, గత పాలనలో గోశాలలో మరణించిన గోవుల ఫొటోలను చూపి అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కరుణాకర్ రెడ్డి టిటిడి చైర్మన్‌గా ఉన్నప్పుడు గోవులకు కాలం చెల్లిన మందులు, పురుగులు పడ్డ దాణా పంపిణీ చేసినట్లు వారి పాలనలో విజిలెన్స్ నివేదికే స్పష్టం చేస్తోందన్నారు. అసత్య ఆరోపణలతో టిటిడి మీద బురద చల్లుతూ రాజకీయ లబ్ధిపొందాలని చూస్తే జీరో అవుతారని హెచ్చరించారు. టిటిడి కమీషన్ల చైర్మన్‌గా కరుణాకర్ రెడ్డి అపకీర్తి మూటగట్టుకున్నారని విమర్శించారు. తాను చైర్మన్ అయ్యాక అవినీతి మరక లేకుండా సేవలు అందిస్తున్నానని తెలిపారు. సమావేశంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, టిటిడి బోర్డు సభ్యులు జి.భాను ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

త్రిఫ్ట్ ఫండ్ బకాయిలు విడుదల చేయాలి

- మంత్రి సవితకు ఎపి చేనేత కార్మిక సంఘం వినతి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ (గుంటూరు జిల్లా)

మంత్రి సవితకు వినతి పత్రం అందజేస్తున్న ఎపి చేనేత కార్మిక సంఘం నాయకులు

టిడిపి కూటమి ప్రభుత్వం 2024-25 బడ్జెట్లో చేనేతకు త్రిఫ్ట్ ఫండ్ కింద కేటాయించిన రూ.5 కోట్లను వెంటనే విడుదల చేయాలని ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ కోరారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లిలోని జయభేరి అపార్ట్‌మెంట్‌లో రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి సవితను ఆదివారం సంఘం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. గత నిధులను విడుదల చేయకపోగా 2025-26 బడ్జెట్లోనూ రూ.5 కోట్లు కేటాయించినట్లు శాసన మండలిలో మంత్రి చెప్పారని గుర్తు చేశారు. చేనేతకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2 వేల కోట్లు విడుదల చేయాలన్నారు. చేనేత సహకార సంఘాలకు చెల్లించాల్సిన యారన్, పావలా వడ్డీ రిబేటు కింద ఇవ్వాల్సిన రూ.156 కోట్లు ప్రభుత్వం చెల్లించాలని కోరారు. నాబార్డ్‌కు వడ్డీలు కట్టలేక సహకార సంఘాలు దివాళా తీస్తున్నాయన్నారు. చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు మార్గదర్శకాలను విడుదల చేయాలని, 30 శాతం రిబేటును ఏడాది మొత్తం కొనసాగించాలని, మగ్గం వేస్తున్న ప్రతి చేనేత కార్మికుడికి 'నేతన్న నేస్తం' ఇవ్వాలని, సొంత స్థలం ఉన్న కార్మికులకు ఇళ్ల నిర్మాణానికి రూ.6 లక్షలు ఇవ్వాలని కోరారు. ప్రయివేట్ సెక్టార్‌లో చేనేత కార్మికులకు త్రిఫ్ట్ అమలు జరపాలని, పట్టు, జరీ నూలు ధరలను 2021 నాటి ధరలకు తగ్గించాలని, చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్లు కచ్చితంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. చేనేత కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ రద్దు చేయాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.శివదుర్గారావు, కార్యదర్శి డి.రామారావు, కె.వెంకటేశ్వరరావు ఉన్నారు.

కాళీయ మర్దనాలంకారంలో కోదండరాముడు

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

వైఎస్‌ఆర్ జిల్లా ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు ఆదివారం స్వామివారిని కాళీయమర్దనగా అలంకరించారు. ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు స్వామివారి వాహన సేవ వైభవంగా జరిగింది. భజన బృందాల భజనలు, కోలాటాల నడుమ స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఉదయం 11 గంటలకు స్నపన తిరుమంజనం వేడుకగా ప్రారంభమైంది. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనంతో సీత, రాముడు, లక్ష్మణ వారి ఉత్సవమూర్తులకు విశేషంగా అభిషేకం చేశారు. రాత్రి 7 నుండి 9 గంటల వరకు అశ్వవాహనంపై స్వామివారిని ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నటేష్ బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, యాత్రికులు పాల్గొన్నారు.

అద్దె మోత.... వడ్డీ భారం

- ఆందోళనలో టిడ్కో గృహాల లబ్ధిదారులు
- టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా నిరాశే

మచిలీపట్నంలో అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలు

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతైనా టిడ్కో గృహాలను పూర్తి చేసి పట్టణ పేద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను నెరవేరుస్తుందని ఆశించిన వారికి నిరాశే ఎదురైంది. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా ఈ గృహ నిర్మాణాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. దీంతో, నెలవారీ అద్దె బాధలు, అప్పు చేసి చెల్లించిన డిపాజిట్లకు వడ్డీ చెల్లింపుతో ఇంకా గృహాలను పొందని లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. మరోవైపు గృహాలు పొందిన లబ్ధిదారులు టిడ్కో కాలనీల్లో మౌలిక వసతుల సమస్యలను ఎదుర్కొంటున్నారు. టిడ్కో ఫ్లాట్లు అందలేదని, కాలనీల్లో మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని ఇటీవల సిపిఎం నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రల్లో పట్టణ ప్రాంత ప్రజలు ఏకరువు పెట్టారు. ఈ సమస్యల పరిష్కారానికి వార్డు సచివాలయాల్లో సిపిఎం నేతలతో కలిసి వినతులు అందించారు.

కృష్ణా జిల్లా మచిలీపట్నం నగరంలోని 37 డివిజన్‌కు చెందిన పేటేటి శ్రీధర్, యడవల్లి లక్ష్మి, బిట్ర కావ్య... ఉయ్యూరు పట్టణం 15వ వార్డు కాకాని గిరిజన కాలనీలో అద్దె గృహాల్లో నివాసం ఉంటున్నారు. 2017లో టిడ్కో జి-ప్లస్ త్రీ అపార్టుమెంట్లలో ఫ్లాట్ల కోసం ఒక్కొక్కరు రూ.25 వేల చొప్పున డిడిలు చెల్లించారు. డిపాజిట్ చెల్లించి ఎనిమిదేళ్లవుతున్నా వీరికి గృహాలను ప్రభుత్వం స్వాధీనం చేయలేదు. దీంతో, వీరు నెలనెలా వారు నివాసం ఉంటున్న గృహాలకు అద్దె చెల్లించక తప్పడం లేదు. రోజువారీ పనులు చేసుకుంటూ జీవిస్తోన్న ఈ కుటుంబాల వారు డిపాజిట్ కట్టడానికి తీసుకున్న ప్రైవేట్ అప్పునకు వడ్డీ కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇది ఈ ముగ్గురి సమస్య మాత్రమే కాదు.... టిడ్కో గృహాల లబ్ధిదారుల్లో ఎక్కువమంది పరిస్థితి ఈ విధంగానే ఉది. 2017లో మచిలీపట్నం నగరపాలక సంస్థలోనూ, కృష్ణా జిల్లా గుడివాడ, పెడన, ఉయ్యూరు మున్సిపాల్టీల్లోనూ 28,336 మందిని టిడ్కో గృహాల లబ్ధిదారులుగా ప్రభుత్వం గుర్తించింది. గత వైసిపి ప్రభుత్వం 12,728 మంది ఫ్లాట్ల నిర్మాణాలను వివిధ కారణాలను చూపుతూ రద్దు చేసింది. అయితే, ఫ్లాట్ల డిపాజిట్ నగదును లబ్ధిదారులకు తిరిగి చెల్లించలేదు. మచిలీపట్నంలో 2,150, గుడివాడలో 8,912 మందికి మొత్తం 11,062 మంది లబ్ధిదారులకు ఫ్లాట్లు పంపిణీ చేశారు. మచిలీపట్నంలో 2,050 మంది, ఉయ్యూరు మున్సిపాలిటీలో 2,496 మంది చొప్పున మొత్తం 4,546 మంది టిడ్కో లబ్ధిదారులు గత ఎనిమిదేళ్లుగా గృహాల కోసం ఎదురు చూస్తున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఈ గృహాల నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. టిడ్కో గృహాల నిర్మాణాన్ని కాంట్రాక్టు సంస్థ ఎల్ అండ్ టి కంపెనీ చేపట్టింది. ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో పనులను మధ్యలో నిలిపివేసింది. దీంతో, గృహాల నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గృహాల నిర్మాణాన్ని వెంటనే పూర్తి వాటిని తమకు స్వాధీనం చేయాలని, లబ్ధిదారులు కోరుతున్నారు. పూర్తయిన ఫ్లాంట్లను లబ్ధిదారులకు అందించకుండా తీవ్ర జాప్యం చేస్తోంది.

టిడ్కో కాలనీల్లో మౌలిక వసతుల సమస్య

గుడివాడ టిడ్కో ఎ బ్లాక్ 28 మూడో ఫ్లోర్ ఫ్లాట్‌లో పి.అనిత, సి 21 సెకండ్ ఫ్లోర్‌లో ఎం.మేరి ఉంటున్నారు. కింద నుంచి మూడు, రెండో ఫ్లోర్‌లోని తమ ఫ్లాట్లకు నీరు మోసుకొని తీసుకెళ్లాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. టిడ్కో కాలనీకి రోజు విడిచి రోజు తాగు నీరిస్తున్నారని, కాలనీలో రోజువారీ వినియోగానికి నీరు అందుబాటులో లేదని మచిలీపట్నం టిడ్కో కాలనీలో నివాసముండే బి.సుబ్రహ్మణ్యం తెలిపారు. గుడివాడ, మచిలీపట్నం టిడ్కో ఫ్లాట్లలో ఏర్పాటు చేసిన డ్రెయిన్ల పైప్‌లు పగిలిపోవడంతో దుర్గంధం వెదజల్లుతోందని, రోజువారీ చెత్త సేకరణ చేయకపోవడంతో ఎక్కడకక్కడే అపారిశుధ్యం పేరుకుపోయి దోమలు విజృంభించి వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని ఈ రెండు పట్టణాల్లోని టిడ్కో కాలనీ వాసులు వాపోతున్నారు. టిడ్కో కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని, అపారిశుధ్యం , ఇతర సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాటం

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కార్మికులను కట్టు బానిసలను చేసే లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా పోరాడాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు కార్మికులకు పిలుపునిచ్చారు. సిఐటియు నాయకత్వ ప్రాంతీయ వర్క్ షాప్‌లో భాగంగా ఆదివారం రెండో రోజు సిఐటియు కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వం కార్మికులకు నష్టదాయకమైన కార్మిక చట్టాలను తీసుకురావడం దుర్మార్గమన్నారు. 29 రకాల కార్మిక చట్టాలను మార్పు చేస్తూ నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం అన్యాయమని తెలిపారు. కార్మికుడు యూనియన్ పెట్టుకునే హక్కును, సమ్మె చేసే హక్కును ఈ లేబర్ కోడ్ల వల్ల హరించుకుపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫిక్స్‌టర్మ్ ఎంప్లాయి పేరుతో కార్మిక హక్కులకు, సామాజిక భద్రత కోడ్‌తో పిఎఫ్, ఇఎస్ఐ లాంటి సౌకర్యాలకు కార్మికుడు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు అఖిలభారత కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపును జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు మాట్లాడుతూ రాబోవు కాలంలో సిఐటియు నాయకత్వంలో నిర్వహించే కర్తవ్యాలను వివరించారు. కార్యక్రమంలో అనంతపురం జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, కడప జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి మనోహర్, నంద్యాల జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి నాగరాజు, సత్యసాయి జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి వెంకటేష్, సిఐటియు నగర నాయకులు సాయిబాబా, నరసింహులు, విజయ్, మహమ్మద్ రఫీ, ఏసు, ప్రభాకర్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు

ప్రజాశక్తి - యలమంచిలి

వైసిపి మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు నోరు అదుపులో పెట్టుకోకపోతే మరోసారి రెచ్చగొట్టేలా మాట్లాడకుండా కాళ్లు చేతులు నరికేస్తామని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అనుచిత వ్యాఖ్యలు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలంలో రూ.1.78 కోట్ల నిధులతో చేపట్టనున్న లింక్ రోడ్లు, జలజీవన్ మిషన్ మంచినీటి పథకం పనులకు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు అనంతరం యలమంచిలి గ్రామంలో 'మన రైతు - మన పాలకొల్లు' కార్యక్రమంలో భాగంగా జరిగిన సభలో పాల్గొని మాట్లాడారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని, సర్పంచ్ స్థాయి నుండి మంత్రుల వరకు అందినకాడికి దోచుకు తిన్నారని, అభివృద్ధి పనులు చేయాలని కోరితే వారిపై కేసులు పెట్టి వేధించారని విమర్శించారు. ఎన్నికల్లో ప్రజలు వైసిపి నేతలకు బుద్ధి చెప్పినా వారిలో మార్పు రాలేదని, గతంలో రైతుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసిపి మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఇటీవల 'తాము మళ్లీ అధికారంలోకి వస్తామని, వచ్చిన తరువాత కూటమి నాయకులను ఇళ్లల్లోంచి లాక్కొచ్చి నరికేస్తామని అహంకారంతో మాట్లాడటం దేనికి నిదర్శనమని అన్నారు.

కారుమూరి మరోసారి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే మాట్లాడకుండా నాలుక కోస్తామని, నడవడానికి అవకాశం లేకుండా కాళ్లు చేతులు నరికేస్తామని వర్మ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కేంద్ర మంత్రి స్థాయిలో ఉండి శ్రీనివాస వర్మ చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యమని సభకు వచ్చిన పలువురు చర్చించుకోవడం కన్పించింది.

కర్నూలు III పీఎస్ ఆర్‌ఈ ట్రాన్స్ మిషన్ లిమిటెడ్
(పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ యొక్క 100% పూర్తిగా యాజమాన్యంలోని అనుబంధ సంస్థ)
B-9, కుతుబ్ ఇన్స్టిట్యూషనల్ ఏరియా, కట్వారియా సారాయ్, న్యూఢిల్లీ -110016

తప్పొప్పుల పట్టిక

ఈ వార్తాపత్రికలో 09.04.2025 ప్రచురితమైన రిఫరెన్స్ పబ్లిక్ నోటీస్.
ప్యాకేజీ B యొక్క ట్రాన్స్ మిషన్ ఎలిమెంట్ 2 కొరకు; ప్యాకేజీ B యొక్క Sl.No 2 ఈ క్రింది విధంగా చదవవచ్చు:-

వరుస నం.	లైన్ పేరు / సబ్ స్టేషన్ (గమనిక ప్రకారం స్థానం)	BPC/సామర్థ్యం యొక్క సర్వే నివేదిక ప్రకారం లైన్ పొడవు	సంవత్సరానికి ట్రాన్స్మిషన్ ఛార్జీలు (INR) మిలియన్లు	COD షెడ్యూల్ చేయండి	వ్యాఖ్యలు
అసలు					
ప్యాకేజీ B					
2.	4 సంఖ్యలు. మెసర్స్ ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క డెడికేటెడ్ ట్రాన్స్ మిషన్ లైన్ల నిలిపివేత కొరకు కర్నూలు-III PS వద్ద 400 కెవి లైన్ బే.			2 Nos.-24 months (27.03.2027) 2 Nos.- 31.12.2027	
సవరించబడింది					
ప్యాకేజీ B					
2.	4 సంఖ్యలు. మెసర్స్ ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క డెడికేటెడ్ ట్రాన్స్ మిషన్ లైన్ల నిలిపివేత కొరకు కర్నూలు-III PS వద్ద ౪౦౦ కెవి లైన్ బే.			2 Nos.- 24 months (27.03.2027) 2 Nos.- 31.03.2027	

పైన చెప్పినవి తప్ప మిగతావన్నీ అలాగే ఉంటాయి.
స్థలం: న్యూఢిల్లీ
తేదీ: 14.04.2025

శ్రీ. ఎ.సి. శంకరయ్య
ప్రాజెక్ట్ ఇన్చార్జ్,
కర్నూలు III పీఎస్ ఆర్‌ఈ ట్రాన్స్ మిషన్ లిమిటెడ్

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్‌గా తెలిసినది, ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమల్గామేట్ చేయబడినది)
CIN : L65110TN2014PLC097792
రిజిస్టర్డు ఆఫీసు: కెఆర్ఎం టవర్స్, 8వ అంతస్తు, హ్యారింగ్టన్ రోడ్, చెట్‌పేట్, చెన్నై-600031.
TEL: +91 44 4564 4000 | FAX: +91 44 4564 4022.
IDFC FIRST Bank

బహిరంగ ప్రకటన
బంగారం వేలం మరియు ఆహ్వాన ప్రకటన

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ నుండి అతను పొందిన బంగారు ఆభరణాలపై క్రెడిట్ సదుపాయానికిగాను బాకీపడిన మొత్తాన్ని చెల్లించడానికి దిగువ పేర్కొన్న రుణగ్రహీతకు నోటీసులు జారీచేయబడ్డాయి. రుణగ్రహీత సదుపాయంలో బకాయిలను తిరిగిచెల్లించడంలో విఫలం చెంది నందున, 29-04-2025న తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాల వేలం నిర్వహించడానికి మేము నిర్బంధించబడ్డాము. ఒకవేళ ఈ వేలం నుండి ఏదైనా మిగులు మొత్తం ఉంటే, దానిని సంబంధిత రుణగ్రహీతకు తిరిగి ఇవ్వబడుతుంది మరియు వేలం తరువాత ఏవేని లోటు ఏర్పడితే, మిగతా మొత్తాలను రుణగ్రహీత నుండి తగిన చట్టపరమైన చర్యల ద్వారా రికవరీ చేయబడుతుంది. ముందస్తు సమాచారం లేకుండా ఈ క్రింది ఖాతాను వేలం నుండి తొలగించే అధికారం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంకుకు ఉంది. తదుపరిగా ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదీని మార్చే హక్కును ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ కలిగి ఉంది.

రుణ ఖాతా నెంబరు	కస్టమర్ పేరు	బ్రాంచ్ పేరు
138605118	రామావత్ దేవి బాయి	సత్తెనపల్లి IFBL
139376743	చింత సుజాత	పెడన IFBL

వేలం 29-04-2025న మ.12:00 నుండి మ.2:00గంటల వరకు https://idfcegold.auctiontiger.net ద్వారా/ 29-04-2025న మ. 03:00 నుండి సా.5:00 గంటల వరకు https://gold.samil.in ద్వారా ఆన్‌లైన్‌లో నిర్వహించబడుతుంది. ఈ ప్రచురణ ద్వారా సంబంధిత రుణగ్రహీతకు దీని ద్వారా తుది నోటీసు ఇవ్వబడింది మరియు షెడ్యూల్ వేలం తేదీకి ముందుగా పూర్తి వడ్డీ మరియు ఛార్జీలతో వసతి రీకాల్డ్ మొత్తాన్ని చెల్లించడానికి చివరి అవకాశం ఇవ్వబడింది, విఫలం చెందినచో ఆభరణాలు వేలం వేయబడతాయి. దయచేసి గమనించండి, సమయ పరిమితి కారణంగా అదే రోజున వేలం పూర్తి కాకపోతే, అవే నియమ & నిబంధనలపై తదుపరి 7రోజుల్లో తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాలను బ్యాంకు తిరిగి వేలంవేస్తుంది. కస్టమర్ మరణించినట్లయితే, వేలానికి సంబంధించిన అన్ని షరతులు అతని చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.
తేదీ: 14-04-2025, ప్రదేశం: ఆంధ్రప్రదేశ్

HDFC BANK
We understand your world

నమోదిత కార్యాలయం : హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోవర్ పారెల్ (పశ్చిమం), ముంబాయి-400013 మరియు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్, 1వ అంతస్తు, I-తింక్ టెక్నో క్యాంపస్, కంజూర్ మార్గ్ (తూర్పు), ముంబాయి-400042 వద్ద ఉన్న రిటైల్ పోర్ట్ ఫోలియో నిర్వహణగా దాని కార్యాలయం ఒకటి.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌కి తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విక్రయానికి సంబంధించిన విక్రయ సమాచారం మరియు బహిరంగ నోటీసు.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ ("బ్యాంకు") యొక్క దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు బ్యాంకుకు తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విక్రయానికి సంబంధించి, రుణం/ఓవర్‌డ్రాఫ్ట్ స్వభావంలో క్రెడిట్ సౌకర్యాలను పొందడం కోసం దీని ద్వారా తెలియజేయబడుతుంది.
అంగీకరించిన లోన్ నిబంధనల ప్రకారం బకాయిలను తిరిగి చెల్లించడంలో రుణగ్రహీతల నిరంతర డీఫాల్ట్ కారణంగా, దిగువ రుణ ఖాతాలు అపరాధ స్థితిలో ఉన్నాయని బ్యాంకు ఈ రుణగ్రహీతలకు అనేక నోటీసులు జారీ చేసింది, దిగువ పేర్కొన్న తేదీలో తుది విక్రయ నోటీసుతో సహా, బ్యాంక్ ప్లెడ్జ్‌ను చేయించిన మరియు దిగువ ఖాతాలలో మొత్తం బకాయిలను తిరిగి చెల్లించడానికి రుణగ్రహీతకు 7 రోజుల సమయం ఇచ్చింది. విఫలమైతే బ్యాంక్ ఈ విషయంలో తదుపరి నోటీసు జారీ చేయకుండా తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను విక్రయించడానికి స్వేచ్ఛ ఉంటుంది. రుణగ్రహీతలు నిర్లక్ష్యానికి గురయ్యారు మరియు సరియైన చెల్లింపులు చేయడంలో విఫలమయ్యారు, కాబట్టి రుణ బప్పందం ప్రకారం బ్యాంకు తన హక్కులను వినియోగించుకోవడంలో ప్లెడ్జిగా రుణగ్రహీతల నుండి బ్యాంకుకు చెల్లించాల్సిన బకాయిలను రికవరీ చేయడానికి 21 ఏప్రిల్, 2025న లేదా ఆ తర్వాత సెక్యూరిటీలను విక్రయించాలని/ డిస్పోస్ చేయాలని నిర్ణయించింది. రుణగ్రహీతలు మార్జిన్ అవసరంలో మరింత లోపాన్ని సృష్టించడానికి స్టాక్ మార్కెట్‌లో అస్థిరత కారణంగా ఎప్పుడైనా తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విలువ మరింత పడిపోతే, ఈ విషయంలో తదుపరి నోటీసు లేకుండా బ్యాంకు తన అభీష్టానుసారం తాకట్టు పెట్టిన సెక్యూరిటీని క్యాలెండర్ రోజు ఒకటి (1) లోపు విక్రయిస్తుంది. రుణగ్రహీతలు ఏదైనా మిగిలిన బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడానికి, తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను విక్రయించడం ద్వారా వచ్చిన మొత్తాన్ని సర్దుబాటు చేసిన తర్వాత బ్యాంకుకు బాధ్యత వహిస్తారు.

క్ర. సం.	లోన్ అకౌంట్ నెం.	రుణగ్రహీతల పేరు	10 ఏప్రిల్, 2025 నాటికి బకాయి మొత్తం	విక్రయ నోటీసు తేదీ
1	XXXX9499	మృదుల వేముల	11,143.00	11-Apr-2025
2	XXXX1450	చిగురుపాటి విజయ్ కుమార్	9,17,049.15	11-Apr-2025
3	XXXX3972	మైలపల్లి సునీత	8,86,177.28	11-Apr-2025
4	XXXX2197	మంచ నాగ సౌజన్య	20,14,324.99	11-Apr-2025
5	XXXX2984	గుణపల్లి వెంకట సత్యాదేవి	11,13,390.13	11-Apr-2025
6	XXXX9527	సీళ్ల వెంకటరమణ	1,29,296.70	11-Apr-2025
7	XXXX1235	మజ్జి అనురాధ	9,93,803.07	11-Apr-2025
8	XXXX2182	కాటం అరుణమ్మ	1,644.99	11-Apr-2025
9	XXXX2297	కాటం అరుణమ్మ	1,644.99	11-Apr-2025
10	XXXX8799	నల్ల అప్పలస్వామి	60.00	11-Apr-2025
11	XXXX1615	సబిత ఎన్.	1,35,150.82	11-Apr-2025

తేది : 14.04.2025
ప్రదేశం : ఆంధ్రప్రదేశ్
సం/-
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్

అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ
సోమవారం 14 ఏప్రిల్ 2025

"మాకు గోడలు లేవు
గోడలను పడగొట్టడమే మా పని
అలజడి మా జీవితం
ఆందోళన మా ఊపిరి
తిరుగుబాటు మా వేదాంతం"

– శ్రీశ్రీ

కుడి కన్ను కుట్ర

కుడి కన్ను గుడ్డిదేం కాదు!
దానికి అంతా తెలుసు
ద్వేషం రంగు పూయందే
దేశభక్తి మొలకెత్తదని!
అవసరం వచ్చినప్పుడు
భయపెట్టో బామాలో
దాని కౌగిలి విస్తరిస్తుంది!
పట్టు సడిలినప్పుడల్లా
ఏదో కొత్త ఎత్తుగడ
జమిలి దాని ఆలోచనలో భాగమే!
భిన్నత్వాన్ని ప్రేమించని వాడు
ఏకత్వాన్ని ఆశించరాదు
సహనమే సర్వ రక్ష!

ఒకవైపు ఒకే చెట్టు
వేయి పూలు పూస్తుంటే
ప్రపంచమే నివ్వెరపోతున్నది!
ఒకటిగా ఉండటం వేరు
ఒకేలా ఉండమనడంలో
ఏదో కనిపించని కుట్ర!
మనం ఋతువులను నియంత్రించనట్లే
వైవిధ్యాన్ని కాదనలేము

ఎవడొస్తాడో రాని
దేశం సరిహద్దులు తాకని
అన్ని గొంతుకలు ఒక్కటైతవి!!

– కోట్ల వెంకటేశ్వర రెడ్డి
94402 33261

బుల్డోజర్ భయం

చెట్టంత మనిషిని కాకపోతిననే
ఇదివరకుండెటి బాధ ఇప్పుడు
ఏ కోశాన ఉంచుకోదలచుకోలే
ఏ పాలకుడి పగకో, చెట్టునై కూలిపోయి
సేదరిల్లుతున్న వారందరినీ చెరుపుకునే
పాపం మూటగట్టుకోలేను కదా?

పండంటి సంసారాన్ని
ఓ పచ్చని చెట్టుతో పోల్చే
సాహసం ఇప్పుడు చేయదలచుకోలే
పాలకుడి కంటి సైగతో
ఏ పూటకో కూలిపోయే చెట్టుతో
కుటుంబాన్నెలా పోల్చగలను?

ఓ నదీ తీరాన చెట్ల గుంపు మధ్య
పిల్లా పాపలతో సేదదీరే ఆలోచనలు
ఇప్పుడు కంపరమే కలిగిస్తున్నాయి
పిల్ల తిమ్మెరల వీచికల కన్నా
కోకిల కూతల కమ్మదనం కన్నా
బుల్డోజర్ భయమే పట్టుకుందిప్పుడు!

ఆకులు కప్పి నాగరికత నేర్పిన
చెట్టునే హత్తుకున్నామెప్పుడూ
నీడనిచ్చి ఊపిరి పోసిన
అడవినే ఆరాధించామెప్పుడూ
అభివృద్ధి పేరిట మట్టుపెడతాం అంటే
చేతులు ముడుచుకుంటూ కూర్చుంటామా?

– వినోద్ కుత్తుం,
96343 14502

ది గ్రేటెస్ట్ ఇండియన్

అంటరానితనాన్ని
వెంటబడి తరిమిన గొంతు
కుల నిర్మూలనా కురుక్షేత్రంలో
పిడికిలి బిగించి పోరాడిన శక్తి
ఆర్థిక శాస్త్రాన్ని
అవపోసన పట్టిన శాస్త్రవేత్త
రాజకీయాలకు సరికొత్త పునాదులు వేసిన
ఓ గొప్ప సంఘ సంస్కర్త..!!

అవును.. అతడొక వ్యక్తి కాదు
పేదరికంలో మగ్గిపోతున్న
లక్షల మంది వైపు నిలబడిన సైన్యం
బడుగు జీవుల పాలిట నిలువెత్తు ధైర్యం!

మొట్టమొదటి న్యాయశాఖ మంత్రి
భారత రాజ్యాంగ రూపశిల్పి
కోట్ల మంది ప్రజల ఆశాజ్యోతి
కుల కట్టుబాట్లను కూకటి వేళ్లతో పెకలించిన జై భీమ్!

మతం కంటే మానవత్వం గొప్పదని
సమానత్వమే తన భావజాలమని
చిరస్మరణీయ జీవిత విధానాన్ని
ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు
బానిస సంకెళ్లను
తన రాతలతో తెగనరికిన మేధావి
భావితరాల భారతావనిలో
మనిషితనాన్ని వెదజల్లిన
ది గ్రేటెస్ట్ ఇండియన్ జై భీమ్...!!

– యు.ఎల్.ఎన్.సింహా,
77022 80542

కొన్ని పూలు కొన్ని కథలు

పూలెప్పుడూ
లోకాన్ని పరిమళం చేసి
రాలిపోతాయి
సున్నితమైన తమ రెక్కల్లో
కొన్ని మాటలను పొదువుకుంటాయి

మాటలన్నీ కొన్ని కథలుగా
తిరిగి ప్రకాశిస్తాయి
ఆకాశం వంగి
ఆమెకు నమస్కరిస్తుంది
ఆమె తన గుప్పిటలోంచి
మిణుగురులను
ఆకాశమంతా వెదజల్లుతుంది
లోకమంతా సస్యశ్యామలమయ్యే
స్వప్నం ఆవిష్కృతమవుతుంది!

– కెక్యూబ్ వర్మ
94934 36277

డా.అంబేద్కర్‌ని ఆవిష్కరించిన గ్రంథం



సృజనాత్మకత వేరు. ఊహలకూ ఆలోచనలకూ రెక్కలు తొడిగి మెప్పించాలి. పరిశోధన అలా కాదు. ఒక పరిధిలోనే పయనించాలి. వాస్తవాన్నే చెప్పాలి. కల్పన కుదరదు. అందుకే పరిశోధన ఎంతో బాధ్యతతో కూడుకుని ఉన్నదని అందరికీ తెలుసు. ప్రామాణికతల్ని నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. విస్తృత అధ్యయనం, తులనాత్మకత దృష్టి అవసరం అవుతుంది. అనేక గ్రంథాలు నిశితంగా పరిశీలనా దృష్టితో చదవాల్సి ఉంటుంది. ఈ పుస్తకం అట్లాంటి శ్రమకు ఫలితంగా భావించొచ్చు. మాన్యులు పి.విష్ణుమూర్తి గారికి ఇట్లాంటి పరిశోధన కొత్త కాదు. జర్నలిజాన్ని నిరంతర వ్యాపకం చేసుకుని లబ్ధప్రతిష్టులయ్యారు. ఆయన తాజాగా వెలువరించిన పరిశోధనాత్మక గ్రంథం 'అమరజ్యోతి డా. అంబేద్కర్'.

పి.విష్ణుమూర్తి గతంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకుని, ఎవరి రిజర్వేషన్లు వారే అనుభవించాలనే భావంతో 'దళిత క్రైస్తవులు– ఎస్సీ రిజర్వేషన్లు' పుస్తకం రాశారు. రాజ్యాంగ మూలసూత్రాల పట్ల అవగాహన కలిగించడానికి 'మనం– మన రాజ్యాంగం' అనే గ్రంథం వెలువరించారు. అది అనేకమంది విద్యార్థులకు కరదీపికగా మారింది. ఇపుడు డా.అంబేద్కర్ సమున్నత మేధో సంపన్నతతో, అచంచల ఆత్మవిశ్వాసంతో సముజ్వల పాత్ర పోషించిన వైనాన్ని సోదాహరణంగా ఎంతో శ్రమించి వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. విష్ణుమూర్తి భారతీయ దళిత సాహిత్య అకాడమీ అధ్యక్షుడు, న్యూఢిల్లీ హెూదాలో తెలుగు, తమిళం, మలయాళం కవులను, కళాకారులెందరికో అంబేద్కర్ జాతీయ ఫెలోషిప్ అవార్డులతో సత్కరించారు. సమాజ మార్పుకు జర్నలిజమే ఆయుధమని నమ్మిన జీవనవిధానం అయనది. ముప్పై ఏళ్ళుగా వారం వారం వార్తా వ్యాఖ్యలతో ప్రజాపత్రిక 'జనమిత్ర'ను నిరాటంకంగా నడుపుతున్నవారు.

'అమరజ్యోతి డా. అంబేద్కర్'.పుస్తకంలో– రాసిందానికి ప్రామాణికత సంతరించేందుకు ప్రముఖుల, మేధావుల వ్యాఖ్యానాలను, సూత్రీకరణలనూ, ఉటంకింపులను అవసరమైన సందర్భంలో జోడించారు. డా.అంబేద్కర్ ఏ భావజాలానికి ప్రేరేపితులు అయ్యారో చెప్పడానికి చాతుర్వర్ణాలు– అస్పృశ్యులు పుట్టుక చారిత్రక పరిణామం ఆది భారతీయుల అస్తిత్వ మూలాలు వివరించారు. హిందూమత ప్రాతిపదిక, హిందూ సమాజ నిర్మాణం, ద్రావిడ సంబంధం, బ్రాహ్మణ ఆధిపత్యం, కులం స్వాభావిక స్థితి, అస్పృశ్యత మూలాలు ... వీటన్నింటి గురించి కూలంకషంగా చర్చించారు.

దేశంలో స్వాతంత్ర్యానికి ముందు జరిగిన కుల సంస్కరణ ఉద్యమాల వివరాలు ఇచ్చారు. కేరళలో నాయర్ ఉద్యమం, మహారాష్ట్రలో సత్యశోధక ఉద్యమం, డిప్రెస్డ్ క్లాసు మూవ్‌మెంటు, తమిళనాడు దక్షిణ రాష్ట్రాల్లో జస్టిస్ పార్టీ ఉద్యమం, సెల్ఫ్ రెస్పెక్టు ఉద్యమాలు... ఇంకా మరెన్నో వివక్ష వ్యతిరేక ఉద్యమాల గురించి పొందుపరచారు. అవగాహన కలిగించే ప్రయత్నం చేశారు. వేల సంవత్సరాల అస్పృశ్యత వల్లే హిందువుల్లోని అనైక్యత ఏర్పడి, భారతదేశం విదేశీయుల వశమైందని సోదాహరణంగా వెల్లడించారు. బెంగాల్‌లో సతీసహగమనం దురాచారంపై తిరుగుబాటు చేసిన రాజారామ్‌మోహనరాయ్, ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక రుగ్మతలపై పోరాడిన కందుకూరి వీరేశలింగం, అస్పృశ్యత బ్రాహ్మణ భావజాలాన్ని మహారాష్ట్రలో పూనా కేంద్రంగా అలుపెరుగని పోరు సలిపిన మహాత్మా జ్యోతిరావు పూలే, పంజాబ్‌లో గురునానక్ శిష్యుడు గురు రవిదాస్, పశ్చిమ భారతదేశంలో వివక్ష తొలగించడానికి ఆత్మారామ్ గోవింద రనడే, ఆర్య సమాజ్ ద్వారా విగ్రహారాధనపై తిరుగుబాటు చేసిన దయానంద సరస్వతి, తమిళనాడులో ఆత్మగౌరవ ఉద్యమం నడిపిన పెరియార్, కేరళలో అసాంఘిక చట్టాల రద్దు కోసం పోరాడిన ఆయ్యన్ కాళి, అస్పృశ్యుల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేసిన భాగ్యరెడ్డి వర్మ... వీరందరి స్ఫూర్తిదాయకమైన ఆచరణాత్మక సంస్కరణల్ని సవివరంగా విశదీకరించారు. ఆయా ప్రాంతాల్లోని సామాజిక సంస్కరణలను వెల్లడించారు.

భారత స్వాతంత్ర్య చరిత్రలో రౌండు టేబుల్ సమావేశాలు ఎంతో ప్రాముఖ్యత వహించిన విషయం తెలిసిందే. డా.అంబేద్కర్ మొదటి ప్రసంగ పాఠంలో అణగారిన వర్గాలకు రాజకీయ అధికారాలు ఎందుకు అవసరమో తెలియజేసి అంటరాని వారి బతుకుల్ని ప్రపంచం దృష్టికి తీసుకొచ్చారు. రెండవ ప్రసంగంలో ఉద్యోగరంగంలో అంటరాని వారు ప్రవేశం కోసం ఒక ప్రత్యేక ప్రతిపత్తి తీసుకురావడానికి దృష్టి సారించాలని నొక్కి చెప్పారు. మూడవ ప్రసంగంలో అల్ప సంఖ్యాకుల్లో అణచివేతకు గురైన తరగతి వారి సంరక్షణ ఆవశ్యకత గురించి మాట్లాడారు. డా.అంబేద్కర్ ప్రసంగాలు ఒక వాస్తవికతనూ అందరి ముందు పెట్టినట్లయింది. ఒక ప్రాతినిధ్యాన్ని ప్రతిఫలించి భవిష్యత్తుకు బాటలు వేసింది. ప్రపంచ చరిత్ర తెలిసిన అంబేద్కర్‌పైకి చిన్న విషయంగా కనిపించే ప్రతి సామాజిక కోణాన్ని లోతుగా విశ్లేషించి బట్టబయలు చేశారు. పరిష్కారాలు సూచించారు.

అణచివేతకు గురైన వర్గాల ప్రతినిధిగా డా.అంబేద్కర్ వయోజన ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేసి మద్దతు ప్రకటించారు. ఓటు హక్కు కల్పిస్తే అధికారం ఇచ్చినట్లుగా భావించి బడుగు జీవితాలు మెరుగవుతాయని చెప్పారు. ఏ ప్రసంగం చేసినా నియమబద్ధంగా నిబద్ధతతో తన వారి ప్రయోజనాల కోసం చేసిన ప్రతిపాదనలే తప్ప బెదిరించడానికి కాదని వివరణ ఇచ్చారు. ప్రత్యేక నియోజక వర్గాలు కేటాయించబడటంలో గాంధీ వాదన తిరస్కరించబడి డా. అంబేద్కర్ ప్రతిభ మెరవడాన్ని గమనించగలం. తర్వాతి కాలంలో అంబేద్కర్ బౌద్ధం స్వీకరణ పూర్వపరాల్ని కూడా సంయమనంతో వివరించారు విష్ణుమూర్తి. బుద్ధుడు చూపిన మార్గం ప్రేమ, న్యాయం, సద్భావం సాధించగలవని అంబేద్కర్ భావించారనే విషయం అవగతమౌతుంది.

ఒక సామాజిక రుగ్మతను రూపుమాపడానికి చట్టం చేస్తే సరిపోదు. చట్టాన్ని గౌరవించడం సామాజికామోదం పొందడం కార్యరూపంలోకి రావడం ముఖ్యం. కులం పేరిట వివక్ష చూపించడం మనిషి చేయదగ్గది కాదు. వివక్షకు తావు లేని సమానత్వ సమాజం కోసం అంబేద్కర్ కలగన్నారు. ఆ కలల ప్రస్థానమేమిటో ఈ పుస్తకం చెబుతుంది. డా. అంబేద్కర్ మీద నేను రాసిన ఒక కవిత ఇలా ముగుస్తుంది : "స్వాభిమాన సంకేతం నీవు / నేల మీద నీ కాంతులు / సామాజిక భావ విప్లవాన్ని ప్రసరించాయి / ఉన్నత శిఖరాగ్రాన / చిరునగవుల వెలుగు నీవు / ఇరుకు మనస్సులకు / విశ్వరూపం చూపించావు / దేశం నడకలకు / హద్దులు గీసిన ప్రవక్తవు నీవు / ఆత్మ గౌరవ పోరాటం నీవు/ దీనజనుల జ్ఞాన ప్రతీకవు నీవు / నిన్ను మించిన దైవం లేదనే / జాతి జనుల కీర్తి పతాకం నీవు / అంబేద్కర్...అంబేద్కర్ / నిత్య చైతన్యాల మార్గదర్శివి నీవు."

ఈ గ్రంథం రాయడానికి విష్ణుమూర్తి అవిశ్రాంతంగా అధ్యయనం చేశారు. మొదటి పేజీ నుంచీ ఆ విషయం తేటతెల్లమౌతుంది. రాజ్యాంగ నిర్మాణంలో అంబేద్కర్ పాత్రను శ్రమకోర్చి మన ముందుంచారు. ప్రసంగాల్ని జాగ్రత్తగా అందరికీ అర్థమయ్యే రీతిలో అనువదించి అందించారు. అనిర్వచనీయ చింతనాపరుడైన డా.అంబేద్కర్ మూర్తిమత్వాన్నీ మేధావితనాన్నీ అంకితభావాన్నీ విపులంగా తెలియజేసినందుకు విష్ణుమూర్తి ఎంతయినా అభినందనీయులు.

– దాట్ల దేవదానం రాజు,
94401 05987

సకల పాండిత్య, కళాసాహితి పెన్గొండ

ఒకనాడు కృష్ణరాయ కిరిట సుమశేఖ
రంబైన యభయహస్తంబు మాది!
ఒకనాడు గీర్దేవతా క్రమ కంకణ
స్వనమైన మాధురీ ప్రతిభ మాది!
ఒకనాడు రామానుజ కుశాగ్ర బుద్ధికే
చదువు నేర్పిదది వంశమ్ము మాది!
ఒకనాటి సకల శోభకు తాన కంబైన
దండి పురంబు పెన్గొండ మాది!

తల్లి దండ్రుల మేధ విద్యామిషద్వ
పాండితీ శోభ పదునాల్గు భాషలందు
బ్రదుకునకు బడి పంతులు, భాగ్యములకు
చీడ పట్టిన రాయలసీమ మాది!

మహా పండితుడు పుట్టపర్తి నారాయణాచార్యులు తన 'శ్రీనివాస ప్రబంధం' కావ్యంలో తన నేపథ్యం గురించి పై విధంగా చెప్పుకున్నారు. ఇకనుంచి నారాయణచార్యుల జయంతిని అధికారిక కార్యక్రమంగా జరుపుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ఏప్రిల్ 10వ తేదీన ప్రకటించింది. 1914 మార్చి 28న అనంతపురం జిల్లా చిత్రావతి నదీ తీరం చియ్యేడు గ్రామంలో జన్మించిన నారాయణచార్యులు 1990 సెప్టెంబర్ 1న కనుమూశారు. పుట్టపర్తి వారి పాండిత్యాన్ని, చేసిన రకరకాల ఉద్యోగాల తీరును గమనిస్తే, ఆయన అంతేవాసి తిరుమల రామచంద్ర గుర్తుకు రాకమానరు. రామచంద్ర కనీసం మూడో వంతు తన ఆత్మకథ 'హంపి నుంచి హరప్పా దాకా' రాయగా; నారాయణచార్యులు ఎన్నో ఇతర రచనలు చేసినా తన స్వీయగతాన్ని మాత్రం పుస్తకంగా నిక్షిప్తం చేయకుండా అంతర్ధానమయ్యారు. 1985 ఏప్రిల్ 28న నారాయణాచార్యులను ఎస్వీ యూనివర్సిటీలో కలిసినప్పుడు ఆటోగ్రాఫ్ అడిగితే – ఆయన మందహాసం చేసి, పుట్టపర్తి అని రాసి దానికి డబుల్ కోట్స్ వేసి ఇచ్చారు. 1988–89 ప్రాంతంలో వారికి జ్ఞానపీఠం తృటిలో తప్పిపోయింది. వారికది దక్కకుండా జారిపోవడం ద్వారా తెలుగు వారు కోల్పోయినది ఏమిటో, బహుశా 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' దినపత్రికలో అనుకుంటా, పర్సా వెంకటేశ్వరరావు జూనియర్ చాలా ఘాటైన విశ్లేషణా వ్యాసాన్ని రాయడం బాగా గుర్తు. ప్రముఖ విమర్శకులు, నారాయణాచార్యులను ఎంతో గౌరవించడమే కాదు, ఆయన శివతాండవాన్ని అద్భుతంగా గానం చేసే అలవాటున్న వల్లంపాటి వెంకటసుబ్బయ్య తన ఆకాశవాణి ప్రసంగంలో ఇలా అన్నారు : "పుట్టపర్తి నారాయణాచార్యులు బహుముఖ ప్రజ్ఞావంతుడు. మహాపండితుడు, మహాకవి, విమర్శకుడు, చరిత్రకారుడు, వాగ్గేయకారుడు, అనువాదకుడు. అతని పాండిత్యానికి ఆకాశమే హద్దు. 'పాండితీశోభ పదునాల్గు భాషలందు' అని తన్ను గురించి తానే చెప్పుకున్నాడు. 'సాక్షాత్కారము' వంటి కావ్యాలు అతని భావలాలిత్యాన్ని చాటితే, 'శ్రీనివాస ప్రబంధము' వంటి కావ్యాలు పాండిత్య గరిమకు అద్దం పడతాయి. కానీ, అన్ని కావ్యాల్లోనూ అంతర్వాహిని భక్తితత్త్వమే! తెలుగులో సాహిత్య విమర్శను సుసంపన్నం చేసిన వారిలో మొదటి వరుసకు చెందినవాడు. 'ప్రబంధ నాయికలు' వంటి సాహిత్య పాత్రల విశ్లేషణతో ప్రారంభమైన ఆయన సాహిత్య విమర్శ వ్యాసుణ్ణి, వాల్మీకినీ, భవభూతినీ, తిక్కననూ, పోతననూ, అన్నమయ్యనూ, కృష్ణరాయలనూ, రామకృష్ణుణ్ణి పరామర్శిస్తూ భాగవత విశ్లేషణలో శిఖరాగ్రాలను చేరుకుంది. 'భాగవత సుధాలహరి' సంపుటాలు పుట్టపర్తి పాండిత్యానికీ, విశ్లేషణాశక్తికి నిదర్శనంగా నిలుస్తాయి.

నారాయణాచార్యులు సంగీత శాస్త్రం తెలిసిన వాగ్గేయకారుడు. 'అష్టాక్షరి' అన్న ముద్రతో వేలాదిగా కీర్తనలు వ్రాశాడు. అతని అభిమాన విషయం చరిత్ర. అతని 'విజయనగర సామాజిక చరిత్ర' కొందరు మహావీరుల, మహారాజుల జీవిత చరిత్రే చరిత్ర కాదని నిరూపించిన అరుదైన గ్రంథం. అతడు సంస్క త, ప్రాకత, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల మంచీ తెలుగులోకి ఎన్నో అనువాదాలు చేశాడు. విశ్వనాథ 'ఏకవీర'ను మలయాళంలోకి అనువదించారు. కానీ, అతని శతాధిక గ్రంథాల్లో పుట్టపర్తి పేరు చెబితే జ్ఞాపకం వచ్చే గ్రంథం 'శివతాండవం'. ఈ కావ్యాన్ని పుట్టపర్తి 1947లో రాసి అదే సంవత్సరం 'భారతి'లో ధారావాహికంగా ప్రచురించాడు." వల్లంపాటి అభిప్రాయం పుట్టపర్తి వారి ప్రభ ఎంతటిదో సూక్ష్మంగా తెలుసుకోవడానికి సులువుగా దోహదపడుతుంది. డా.పుట్టపర్తి నాగపద్మిని త్వరలో ప్రచురించబోతున్న పుస్తకంలో వివరించిన నారాయణాచార్యుల బాల్యం నాటి విషయాలు చదువుతూ ఉంటే నాకు మా అనంతపురం జిల్లా అంతా కలయ తిరిగినట్టు అనిపించింది. నారాయణచార్యుల వారి నాన్న పెనుగొండలో ఉద్యోగం చేశారు. బుక్కపట్నంలో ఈయన వివాహం చేసుకున్నారు. నాగినాయన చెరువు గ్రామంలో నృత్యంపై మోజు పడ్డారు. కళ్యాణదుర్గంలో తల్లి మరణం... ఇలా ఈ సమాచారమంతా చదువుతూ ఉంటే నాకెందుకు ఆనందంగా ఉండదు? 'లత' పత్రికలో ప్రచురింపబడిన, ఇందులో పేర్కొన్న ఆయన జ్ఞాపకాలను చదువుతూ ఉంటే మొత్తం వెతికి పట్టుకుని, ఇప్పటికిప్పుడే చదవాలనిపిస్తోంది. 'పుట్టపర్తి' అనే ఇంటి పేరు, అనంతపురం జిల్లా, చిత్రావతి తీర ప్రాంతమైన చియ్యేడు గ్రామానికి చెందడం, 'పెనుగొండ లక్ష్మి' పేరుతో కావ్యం రాయడం ... ఈ కారణాలతో వారంటే నాకు ఎంతో మానసిక సాన్నిహిత్యం. మాది అనంతపురం జిల్లా, అలాగే పెనుగొండ తాలూకా కావడం ఒక విషయం కాగా; నేను డిగ్రీ చదువుకున్నది పుట్టపర్తిలోని కాలేజీలో. సత్యసాయితో ముడిపడిన పుట్టపర్తి కాకుండా, దీనికి 25, 30 కిలోమీటర్ల దూరంలో మరో పుట్టపర్తి తెలుగు సరిహద్దు కన్నడ ప్రాంతమైన బాగేపల్లి సమీపంలో ఉంది. ఈ రెండు పుట్టపర్తి గ్రామాలు చిత్రావతీ నది తీరంలోనే ఉన్నాయి. ఈ రెండవ పుట్టపర్తి కూడా నాకు తెలుసు, ఎందుకంటే మా అమ్మ కంటే పెద్దదైన కమలమ్మ ఆ ఊరి కోడలే కనుక. ఆ పుట్టపర్తికి నేను హైస్కూల్లో చదివే కాలంలో రెండు, మూడుసార్లు వెళ్లాను కూడా. పన్నెండేళ్ల వయసులో నారాయణాచార్యులు రాసిన 'పెనుగొండ లక్ష్మి' కావ్యం తర్వాత తను విద్వాన్ కోర్స్ చదివే కాలంలో మద్రాసు విశ్వవిద్యాలయం సిలబస్‌లో ఉంచడం, ఆ పరీక్షలో నారాయణచార్యులు ఆ ప్రశ్న గురించే రాస్తూ మిగతావి రాయకపోవడం వల్ల పరీక్ష తప్పడం చాలా చమత్కారమైన దృష్టాంతం. ఈ 'పెనుగొండ లక్ష్మి' కావ్యంలో ముస్లిములు ఎంతో భక్తితో గౌరవించే బాబయ్య గోరీ గురించి వివరించిన సందర్భంలో నారాయణ చార్యులు రాసిన ఈ పద్యం కనబడుతుంది :

"కళలు శాస్త్రంబు రెండు నైక్యంబు జెంది
యేక రీతిగా నిలిచినదీ సమాధి
సత్యమందుకే దివ్యవర్చస్సు గలదు
అనుభవజ్ఞుని సుకవి వాక్యమ్ము వోలె"

ప్రఖ్యాత, పాశ్చాత్య విమర్శకులు సి.పి.స్నో తన 'ది టు కల్చర్స్' వ్యాసంలో వివరించిన లెక్కన 12 ఏళ్ల బాల నారాయణుడు ఇంత దార్శనికతతో కవిత్వాన్ని రాయడం ఏమిటి అద్భుతం గాక? నారాయణచార్యులు మహాత్ముని జీవితం ఆధారంగా హరికథ కూడా చెప్పి రక్తి కట్టించేవారు.

– డా. నాగసూరి వేణుగోపాల్,
ఆకాశవాణి పూర్వ సంచాలకులు, 94407 32392

పండగలా పి.ఎస్. పరిషత్!

దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య (పి.ఎస్.) పేరిట పల్నాడు జిల్లా యడ్లపాడులో ఏప్రిల్ 4, 5, 6 తేదీల్లో 22వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు పండగ వాతావరణంలో జరిగాయి. కళాకారుల్నీ, అధిక సంఖ్యలో హాజరైన ప్రేక్షకుల్నీ ఎంతగానో ఆదరించిన నిర్వాహకులు ప్రశంసార్హులు. కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు సైతం ఆద్యంతం పాల్గొనేలా చూడటం మరీ అభినందనీయం. భిన్న ఇతివృత్తాల నాటికల్ని ఎంపిక చేయడం విశేషం.

నాన్నా నేనొచ్చేస్తా! : పిల్లల్ని బాధ్యతలు తెలియకుండా, అతి గారాబంగా పెంచడం వల్ల సంసారాలు విచ్ఛిన్నమవుతున్న తీరును కళ్లక్కట్టి పండించారు అమృత లహరి థియేటర్స్, గుంటూరు కళాకారులు. రచన తాళాబత్తుల వెంకటేశ్వరరావు. అమృత లహరి దర్శకత్వంలో ప్రదర్శన, దర్శకత్వం, నటి (అమృతవర్షిణి) సహా మొత్తం ఐదు ప్రథమ బహుమతులు సాధించారు.

నా శత్రువు : అరచేతిలో అందుబాటులోకొచ్చిన ఫేస్‌బుక్, ఇన్స్టాగ్రామ్ ఇత్యాది అధునాతన సాంకేతిక సదుపాయాలతోనే జీవితం అనుకునే వారికి కనువిప్పు యువభేరి థియేటర్స్, హైదరాబాద్ వారి నాటిక. వడ్డాది సత్యనారాయణ దర్శకత్వం. అక్కల తామేశ్వరయ్య రచన. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా నిలిచిన ఇందులో వ్యక్తిగత బహుమతి గెల్చుకున్న జ్యోతి నటన హైలైట్.

జనరల్ బోగీలు : పి టి మాధవ్ రచన, గోపరాజు విజయ్ దర్శకత్వంలో శ్రీ సాయి ఆర్ట్స్, కొలకలూరు కళాకారులు తృతీయ ఉత్తమ ప్రదర్శన బహుమతి సాధించారు. మరో రెండు వ్యక్తిగత బహుమతులు దక్కాయి. సాధారణ బోగీల సంఖ్య గణనీయంగా పెంచాలని, ఆ బోగీల ప్రయాణికుల వివరాలు కూడా రైల్వే వద్ద ఉండి తీరాలనే డిమాండ్‌పై శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ ఉపాధ్యాయుడి సుదీర్ఘ పోరాటం ఆధారంగా రూపొందిన నాటిక ఇది. కంటెంట్ కన్విన్సింగ్‌గా ఉన్నా ప్రధానంగా డైలాగుల మీద నడిచే నాటిక. ప్రారంభంలోని దృశ్యం తప్ప మిగతా అంతా పోలీస్ స్టేషన్లో వాద ప్రతివాదాలే!

'నాన్నా నేనొచ్చేస్తా' నాటికలో ఒక సన్నివేశం

చిగురు మేఘం : జబ్బునపడ్డ గ్రామీణ భారతానికి వైద్యులు తరలాల్సిన అవశ్యకతను వక్కాణించారు– ప్రధాన పాత్రలో వ్యక్తిగత బహుమతి కూడా గెల్చుకున్న రచయిత కావూరి సత్యనారాయణ. ఏపూరి హరిబాబు దర్శకత్వంలో అమరావతి ఆర్ట్స్, గుంటూరు కళాకారులు ప్రదర్శించారు.

బ్రహ్మస్వరూపం : "ధర్మ శబ్దాలు వినిపించాల్సిన చోట కర్మ శబ్దాలు వినిపించింది. ధర్మం ఎప్పుడూ న్యాయాన్నే గెలిపిస్తుంది" అంటారు– ప్రధాన పాత్ర పోషించిన దర్శకుడు టి.వి.పురుషోత్తం ద్వారా రచయిత స్నిగ్ధ. హాయిగా సాగే కుటుంబంలో అనుకోకుండా జరిగిన ఓ రోడ్డు ప్రమాదం ఎంత అల్లకల్లోలం సృష్టించిందో హృద్యంగా చూపారు మైత్రి కళానిలయం, విజయవాడ కళాకారులు.

విడాకులు కావాలి : అతి స్వల్ప విషయాల మీద నిత్యం కొట్లాడుకునే వృద్ధ దంపతులు విడాకులే శరణ్యమనుకుంటారు. ఇంట్లోనే అనుకోకుండా జరిగిన ఓ చిన్న ప్రమాదంతో ఒకరి తోడు మరొకరికి అనివార్యమైన స్థితిలో.. విడాకుల్ని తూచ్ కొట్టడం ఈ హాస్య నాటిక ముగింపు. వల్లూరు శివప్రసాద్ రచన. ప్రధాన పాత్ర పోషించి, వ్యక్తిగత బహుమతి కూడా సాధించిన గంగోత్రి సాయి దర్శకత్వంలో అరవింద్ ఆర్ట్స్, తాడేపల్లి కళాకారులు ప్రదర్శించారు. ఇల్లాలి పాత్రకూ ఉత్తమ సహాయ నటి బహుమతి దక్కింది.

కిడ్నాప్ : తల్లిదండ్రుల, పెద్దల ప్రాధాన్యాన్ని బిడ్డలకు నాటకీయంగా తెలియజేసి, కనువిప్పు కలిగించే ప్రయత్నం చేశారు– స్వీయ దర్శకత్వంలో రచయిత చెరుకూరి సాంబశివరావు. ప్రధాన పాత్రలో ఆయన అభినయం మరింత సహజంగా, పాత్రోచితంగా ఉంటే బాగుం డేదని పించింది. ఉత్తమ బాల నటుడు, విలన్ పాత్ర ధారి సహాయ నటుడు బహుమతులు అందుకున్నారు.

ఋతువు లేని కాలం : అగస్త్య రచనను వై.బి.చౌదరి దర్శకత్వంలో కళానికేతన్, వీరన్నపాలెం కళాకారులు ప్రదర్శించారు.

గురితప్పిన వేట : పి.మృత్యుంజయరావు రచనను వైఎస్ కృష్ణేశ్వరరావు దర్శకత్వంలో రసఝరి, పొన్నూరు కళాకారులు– అంతంత మాత్రంగా ప్రదర్శించారు.

ప్రత్యేక ప్రదర్శనగా స్థానిక కళాకారులు.. నిర్వాహకులు మానవత, యడ్లపాడు పేరిట 'బావా ఎప్పుడు వచ్చితీవు' నాటికను జరుగుల రామారావు దర్శకత్వంలో ప్రదర్శించారు.

వినూత్న రీతిలో న్యాయ నిర్ణయం

సాధారణంగా (ముగ్గురు) కళారంగ ప్రముఖుల ప్యానెల్ న్యాయనిర్ణయం చేస్తుంది. యడ్లపాడులో దీనికి భిన్నంగా 15 మంది సాధారణ ప్రేక్షకుల్ని న్యాయనిర్ణేతలుగా నిర్ణయించి.. ఆయా విభాగాలకు, నటవర్గానికి వారు ఇచ్చిన మార్కుల ఆధారంగా నిర్వాహకులు జడ్జిమెంట్ ప్రకటించారు. పరిషత్‌ను అత్యంత విజయవంతంగా నిర్వహించిన ముత్తవరపు సురేష్ బాబు (దంపతులు), ముత్తవరపు రామారావు, జరుగుల శంకర్రావు, నూతలపాటి మన్మధరావు, పద్మారావు తదితరులతో కూడిన బృంద సమష్టి కృషిని అందరూ హర్షించారు.

– జి.వి.రంగారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్
99126 15747

బహుభాషా నాటకోత్సవాలు భేష్!

'ది సాల్ట్ ఆఫ్ లైఫ్'లో ఒక దృశ్యం

'లీడర్స్ అకాడమీ' ఆధ్వర్యంలో లీడర్ విశాఖ జాతీయ నాటకోత్సవాలు – 2025.. మార్చి 27, 28, 29 తేదీల్లో విశాఖపట్నం కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల, మరో రెండు మూడు స్థానిక ప్రముఖ సంస్థల సౌజన్యంతో విజయవంతంగా నిర్వహించిన ఈ బహు భాషా నాటకోత్సవాలకు ప్రేక్షకులు అధిక సంఖ్యలో హాజరవ్వడం నిర్వాహకుల కృషికి నిదర్శనం.

నాటకాల పరామర్శ

ఐటమ్ (గుజరాతీ) : 'అస్తిత్వ ఆర్ట్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో (సాధారణ ప్రక్రియకు భిన్నంగా) నాటక ప్రదర్శన కొనసాగింది. మహిళ అంతరంగాన్ని, ఆయా సందర్భాల్లో ఆమె ఆలోచనల్ని, స్పందనలను ప్రదర్శించాలన్న అర్పితా ధాగత్ కాన్సెప్ట్‌పై మరో నలుగురు యువతులు తమ అభిప్రాయాలను, అవగాహనను వ్యక్తం చేస్తే.. డిజైన్ చేసిన ఆమె వాటిని క్రోడీకరించి.. దర్శకత్వం వహించారు. కోరస్ డ్రస్‌లో.. వీధినాటిక తరహాలో గంటంబావు సేపు ఐదుగురు యువతుల డైలాగులతోనే నాటకం సాగింది. స్టేజీ ముందు భాగంలో కొద్ది జాగాను వదలి, ఐదు చిన్న రూములు ఏర్పాటు చేసి.. ఒక్కో దానిలో ఒక్కొక్కరు అక్కడి నుంచి / బయటకు వచ్చి.. అటూ ఇటూ తిరుగుతూ డైలాగులు చెప్పి మళ్లీ చాంబర్లోకెళ్లి కర్టెన్ వేసుకునేవారు. స్త్రీ పట్ల సమాజం తేలిక భావం తీరును, దానిపై సంఘర్షణనూ ప్రదర్శించిన ప్రయోగాత్మక నాటిక ఇది.

ది సాల్ట్ ఆఫ్ లైఫ్ (హిందీ) : అరుణాచల్ ప్రదేశ్ గిరిజన జనజీవన దృశ్యాన్ని ఆవిష్కరించిన ఈ ప్రదర్శన ప్రేక్షకుల్ని ఆసాంతం ఆకట్టుకుంది. తమ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ ప్రాజెక్టుకు తమ ముఖ్యమంత్రి మంజూరు చేసిన రూ.ఆరున్నర కోట్లతో ఇప్పటికే ప్రపంచంలో అనేక దేశాల్లో 33 ప్రదర్శనలిచ్చినట్లు యువ దర్శకుడు రికెన్ ఎన్గొమ్లె తెలిపారు. స్టేజీ మీద వెనక భాగంలో పావు వంతు ఓ అడుగు ఎత్తులో మరో వేదిక.. దానికి ఇరు వైపులా ర్యాంపులూ.. ఇంతే! పాత్రధారులు మాత్రం పాత్రలో భాగంగా పరికరాల్ని కొద్దిమేరకు వాడుకున్నారు. కొద్దిపాటి డిమ్ లైటింగ్, స్పాట్స్‌తోనే.. సీన్ల మధ్య గ్యాప్ లేకుండా లైట్స్ ఆఫ్ ఆన్ తోనే చకచకా సమర్థంగా నడిపారు. పురాతన వర్తక.. సాంస్కృతిక మార్పిడులకు ఈ కథ ఓ ఉదాహరణగా నిలుస్తుందని దర్శకుడు తెలిపారు.

ది టైగర్ మ్యాన్ (మలయాళీ) : కేరళ కాలికట్ విశ్వవిద్యాలయ విద్యార్థి బృందం– మలయాళం భాష రాని హెయ్సనమ్ తోంబా (మణిపురి) దర్శకత్వంలో ప్రదర్శించిన నాటకం సూపర్ సక్సెస్. అత్యధిక భాగం స్లోగా నడిచినా.. దాదాపు ప్రతి లైట్స్ ఆఫ్ అనంతరం ప్రేక్షకుల కరతాళధ్వనులు అందుకున్నారు. సంగీత బేస్ శృతిని ఆసాంతం కొనసాగించగా తదనుగుణంగా నటీనటులు పాత్రల్లో ఒదిగిపోయారు. ఎప్పటికప్పుడు స్పాట్స్, లైట్ డిమ్ లైటింగ్ ప్రక్రియతో అద్భుతంగా పండించారు. ప్రతీకాత్మకంగా మానవ స్వభావాలను వెల్లడించే దృశ్య సాధనంగా ఈ ప్రదర్శన సాగింది.

ఆగని టారిఫ్ వార్

- త్వరలో ఎలక్ట్రానిక్స్, ఫార్మావస్తువులపై సుంకాలు
- యుఎస్ కామర్స్ సెక్రెటరీ హోవార్డ్ లుట్నిక్
- భారత్ పైనా తీవ్రప్రభావం

ప్రపంచ వాణిజ్య మార్కెట్‌లో తనకు పోటీగా ఉన్న చైనాను టార్గెట్‌గా చేసుకుంటూ యూఎస్‌లోని డోనాల్డ్ ట్రంప్ యంత్రాంగం తన టారిఫ్‌ల యుద్ధాన్ని సాగిస్తున్నది. చైనా ఉత్పత్తులే లక్ష్యంగా ఇప్పటికే పరస్పర సుంకాలకు దిగింది. ఇప్పుడు చైనా ఆధిపత్యం కలిగిన ఎలక్ట్రానిక్స్, ఫార్మా వస్తువులపై టారిఫ్‌లు విధించటానికి సిద్ధమవుతున్నది. ఒకట్రెండు నెలల్లో ఈ సుంకాల విధింపు ఉండనున్నది. యూఎస్ కామర్స్ సెక్రెటరీ హోవార్డ్ లుట్నిక్ ఈ విషయాన్ని ఒక వార్త సంస్థకు తెలిపారు.



న్యూఢిల్లీ : చైనా ఆధిపత్యం కలిగిన ఎలక్ట్రానిక్, ఫార్మావస్తువులపై సుంకానికి అమెరికాలోని డోనాల్డ్ ట్రంప్ యంత్రాంగానికి సిద్ధమవుతున్నది. ఈ విషయంలో యూఎస్ కామర్స్ సెక్రెటరీ హోవార్డ్ లుట్నిక్ కీలక వ్యాఖ్యలు చేశారు. స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, కొన్ని ఇతర ఎలక్ట్రానిక్స్ ప్రత్యేక టారిఫ్‌ల కిందకు రానున్నాయని చెప్పారు. ఒకనెలలోపు సెమీకండక్టర్‌లపై సుంకాల విధింపులు ఉంటాయని చెప్పారు. చైనా దిగుమతులపై ప్రతిపాదిత 145 శాతం పరస్పర సుంకాల నుంచి స్మార్ట్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు వంటి కీలకమైన ఎలక్ట్రానిక్‌లను మినహాయించాలని డోనాల్డ్ ట్రంప్ యంత్రాంగం గతవారం నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. ఇప్పుడు ఆ మినహాయింపు తాత్కాలికమేనంటూ లుట్నిక్ నుంచి ఈ ప్రకటన రావటం గమనార్హం.

అది తాత్కాలిక ఉపశమనమే

సుంకాల నుంచి వివిధ రకాల ఎలక్ట్రానిక్ పరికరాలను మినహాయించాలని ఈనెల 2న ప్రకటించిన ట్రంప్ పాలనాయంత్రంగం నిర్ణయం తాత్కాలిక ఉపశమనమేనని ఆయన స్పష్టం చేశారు. ఈ ఉత్పత్తులు త్వరలో 'సెమీకండక్టర్ టారిఫ్'లను ఎదుర్కోనున్నాయనీ, ఒకటి లేదా రెండు నెలల్లో అమల్లోకి వస్తాయని వివరించారు. "మనకు చిప్స్ ఉండాలి. సెమీకండక్టర్స్ ఉండాలి. ఫ్లాట్‌ప్యానెల్లు ఉండాలి. ఈ వస్తువులను మనం అమెరికాలో తయారు చేయాలి. మనకు సంబంధించిన అన్ని విషయాల కోసం మనం ఆగ్నేయాసియా, ముఖ్యంగా చైనాపై ఆధారపడలేం" అని ఆయన అన్నారు. వాటిని పరస్పర సుంకాల నుంచి మినహాయించినట్టు అధ్యక్షుడు ట్రంప్ చెప్తున్నా.. అవి సెమీకండక్టర్ సుంకాలలో చేర్చబడ్డాయని చెప్పారు. ఇవి బహుశా ఒకటి లేదా రెండు నెలల్లో వస్తున్నాయని అన్నారు.

ఔషధ సుంకాల విధింపు

ఒకటి లేదా రెండు నెలల్లో ఔషధ సుంకాల విధింపు ఉంటుందని చెప్పారు. సెమీకండక్టర్ , ఫార్మాస్యూటికల్ పరిశ్రమలు తమ వ్యాపారాన్ని అమెరికాకు తరలించే విషయంలో ప్రోత్సహించటానికి ట్రంప్ యంత్రాంగం 'టారిఫ్ మోడల్'ను అమలు చేస్తుందని నొక్కి చెప్పారు. "మనకు అవసరమైన ప్రాథమిక విషయాల కోసం విదేశాలపై ఆధారపడొద్దు. కాబట్టి ఇది శాశ్వత మినహాయింపు కాదు. ఇవి మనం అమెరికాలో తయారు చేసుకోవాల్సిన జాతీయ భద్రతకు సంబంధించిన విషయాలు" అని ఆయన అన్నారు.

భారత్ పైనా ఎఫెక్ట్

ఇక అమెరికా కొత్త టారిఫ్ విధింపుల భయాలు భారత్‌లోనూ నెలకొన్నాయి. ట్రంప్ యంత్రాంగం నిర్ణయం భారత్‌లోని ఎలక్ట్రానిక్స్, ఫార్మా రంగాలపై ప్రభావం చూపనున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈనెల 2న డోనాల్డ్ ట్రంప్ వివిధ దేశాలపై పరస్పర సుంకాలను ప్రకటించిన విషయం విదితమే. ఆ తర్వాత ఒక్క చైనా మినహా మిగతా దేశాలపై వాటిని 90 రోజుల పాటు తాత్కాలికంగా నిలిపివేశాడు. చైనా దిగుమతులపై అమెరికా యంత్రాంగం 145 శాతం సుంకాన్ని ప్రకటించింది. ప్రతిగా చైనా కూడా అదే స్థాయిలో దీటుగా బదులిచ్చింది. దీంతో రెండు బలమైన ఆర్థిక వ్యవస్థల మధ్య పరస్పర సుంకాలు వాణిజ్య యుద్ధానికి దారి తీశాయి.

అర్చకునిపై బిజెపి ఎమ్మెల్యే కుమారుడి దాడి

- అర్ధరాత్రి ఆలయం తలుపులు తెరవలేదని అనుచరుల వీరంగం

భోపాల్ : మతం పేరుతో బిజెపి, ఆర్‌ఎస్ఎస్ ఉద్రిక్తతలు రెచ్చగొడుతుండగా, మరోపక్క అధికార పార్టీ నేతల కుటుంబీకులే ఆలయాల నిర్వాహకులపై దాడులు చేస్తున్నారు. బిజెపి పాలిత రాష్ట్రం మధ్యప్రదేశ్‌లో జరిగిన ఒక ఘటనే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. అర్ధరాత్రి సమయంలో వచ్చి గుడి తలుపులు తెరవాలంటూ ఒక ఆలయ అర్చకుడిపై బిజెపి ఎమెల్యే కుమారుడి అనుచరులు భౌతికదాడి చేశారు. తీవ్రస్థాయిలో దూషణలకు దిగారు. దేవాస్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారటంతో ఎమ్మెల్యే కుమారుడు, ఆయన అనుచరుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

పోలీసులు, ఆలయ అర్చకుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఇండోర్ ఎమ్మెల్యే గోలు శుక్లా కుమారుడు రుద్రాక్ష్ శుక్లా గతవారం తన అనుచరులతో కలిసి 12 కార్లతో కాన్వాయ్‌గా అర్ధరాత్రి 12.45 గంటల ప్రాంతంలో ప్రతిష్టాత్మక చాముండా దేవి ఆలయానికి చేరుకున్నాడు. అప్పటికే గుడి తలుపులు మూసివేసి ఉన్నాయి. ఇంతలో రుద్రాక్ష్ అనుచరుడైన జితేంద్ర రఘువంశీ అక్కడ నానా హంగామా చేశాడు. రుద్రాక్ష్ పూజలు చేస్తాడనీ, గుడి తలుపులు తెరవాలని ఆలయ పూజారితో గొడవకు దిగాడు. రాత్రి సమయంలో తలుపులు తెరవటానికి ఆలయ నిబంధనలు ఒప్పుకోవని పూజారి ఉపదేశ్‌నాథ్ చెప్పడంతో, ఆయనపై జితేంద్ర దాడి చేశాడు. అసభ్య పదజాలంతో దూషించాడు. ఈ ఘటనపై ఫిర్యాదుతో పోలీసులు జితేంద్రపై బిఎన్ఎస్‌లోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. పోలీసు ఎఫ్ఐఆర్‌లో జితేంద్ర పేరు మాత్రమే కనిపించటం, ఎమ్మెల్యే కుమారుడి పేరు లేకపోవటం పట్ల పలువురు విమర్శిస్తున్నారు. దీనిపై పోలీసులు స్పందిస్తూ.. సిసిటివి ఫుటేజీలను పరిశీలిస్తున్నామని, అన్ని ఆధారాలను పరీక్షించిన తర్వాత తగిన చర్యలుంటాయని చెప్పారు. ఈ ఘటనలో ఎమ్మెల్యే కుమారుడిని తప్పించే చర్యలు జరుగుతున్నాయనీ, ఇందులో ఆయన హస్తంపై నిగ్గుతేల్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేసిన తర్వాత.. దానిని ఉపసంహరించుకోవాలంటూ తనకు ఒక ఫోన్‌కాల్ వచ్చిందని ఆలయ పూజారి ఉపదేశ్‌నాథ్ చెప్పారు. ఈ విషయంలో రాజీపడేది లేదని ఆయన ఒక వీడియో సందేశంలో స్పష్టం చేశారు.

వార్షిక శిలువ ఊరేగింపునకు అనుమతి నిరాకరణ

- ఢిల్లీ పోలీసుల తీరును ఖండించిన సిపిఎం

న్యూఢిల్లీ : పామ్ సండే సందర్భంగా నిర్వహించే సాంప్రదాయ కార్యక్రమం వార్షిక శిలువ ఊరేగింపునకు ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు. ప్రతి ఏడాది గుడ్‌ఫ్రైడేకు ముందు వచ్చే ఆదివారం ఓల్డ్ ఢిల్లీలోని సెయింట్ మేరీ చర్చ్ నుంచి గోలే డాక్ ఖానా వరకూ ప్రశాంతంగా ఈ ఊరేగింపు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది పోలీసులు అనుమతి నిరాకరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఢిల్లీ పోలీసుల నిర్ణయాన్ని సిపిఎం తీవ్రంగా ఖండించింది. శాంతి భద్రతలు, ట్రాఫిక్ సమస్యలు సాకుగా చూపుతూ ఊరేగింపునకు ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. పని దినాలు, రద్దీ సమయాల్లోనూ వివిధ ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతి ఇచ్చిన పోలీసులు ఇప్పుడు తిరస్కరించడం వింతగా అనిపిస్తుందని సిపిఎం పేర్కొంది. ఢిల్లీ పోలీసులు కేంద్ర హోం శాఖ పరిధిలో ఉంటారు కాబట్టి, ఇప్పటి వరకూ ప్రతి ఏడాది అత్యంత క్రమశిక్షణగా, శాంతియుతంగా, అధికారులకు పూర్తిగా సహకరిస్తూ నిర్వహించిన ఈ వేడుకకు ఈ ఏడాది ఎందుకు అనుమతి నిరాకరించారో కేంద్ర హోం మంత్రే సమాధానం ఇవ్వాలని సిపిఎం డిమాండ్ చేసింది. అనుమతి నిరాకరించడం ఆర్‌ఎస్ఎస్ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వ నిరంకుశ, మైనార్టీ వ్యతిరేక వైఖరికి మరో ఉదాహరణ అని విమర్శించింది. అన్ని మతాలను సమానంగా చూసేలా, అన్ని మతాలకు ఇచ్చిన రాజ్యాంగ స్వేచ్ఛను నిలబెట్టేలా భారత ప్రభుత్వం కట్టుబడి ఉండాలని సిపిఎం విజ్ఞప్తి చేసింది.

ఇంగ్లీష్ హింగ్లీష్...!

- ఆంగ్ల మాధ్యమ పుస్తకాలకు హిందీ టైటిల్స్
- ఎన్‌సిఇఆర్‌టి నిర్వాకం
- 'హిందీ వలసవాదా'న్ని ప్రోత్సహిస్తోందంటున్న విద్యావేత్తలు

న్యూఢిల్లీ : కొత్తగా రూపొందించిన అనేక ఆంగ్ల మాధ్యమ పాఠ్య పుస్తకాలకు ఎన్‌సిఇఆర్‌టి హిందీ టైటిల్స్ పెట్టింది. ఆంగ్ల పుస్తకాలకూ హిందీ పేర్లే పెట్టడం గమనార్హం. ఎన్‌సిఇఆర్‌టి చర్య 'హిందీ వలసవాదాన్ని' ప్రోత్సహిస్తోందని విద్యావేత్తలు విమర్శిస్తున్నారు. పాఠశాలల్లో త్రిభాషా విధానం అమలుపై తమిళనాడు పోరాడుతున్న సమయంలో ఎన్‌సిఇఆర్‌టి తాజా వివాదానికి తెరలేపింది. హిందీయేతర భాషలు మాట్లాడే రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం హిందీని బలవంతంగా రుద్దుతోందని తమిళనాడు విమర్శిస్తున్న విషయం తెలిసిందే.

సంగీత వాయిద్యాల పేర్లెందుకు?

వివిధ భాషలకు సంబంధించిన ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాలకు ఇప్పటివరకూ ఆయా భాషల పేర్లే ఉన్నాయి. ఉదాహరణకు పోయిన ఏడాది వరకూ ఆరవ తరగతి ఆంగ్ల పాఠ్య పుస్తకానికి 'హనీసకిల్' అని, ఏడో తరగతి పుస్తకానికి 'హనీకూంబ్' అని పేర్లు ఉన్నాయి. ఇప్పుడు ఈ రెండు తరగతులకు రూపొందించిన కొత్త ఆంగ్ల పాఠ్య పుస్తకాలకు 'పూర్వి' అనే హిందీ పేరు పెట్టారు. పూర్వి అంటే తూర్పు అని అర్థం. హిందుస్థానీ క్లాసికల్ సంగీతంలో ఒక రాగానికి కూడా పూర్వి అనే పేరు ఉంది. ఒకటవ, రెండవ తరగతి ఆంగ్ల పాఠ్య పుస్తకాలకు 'మృదంగ్' అనే హిందీ టైటిల్ పెట్టారు. మూడు, నాలుగు తరగతుల ఆంగ్ల పుస్తకాలకు 'సంతూర్' అని నామకరణం చేశారు. ఇది కూడా హిందీ పేరే. మృదంగ్, సంతూర్ అనేవి సంగీత వాయిద్యాల పేర్లు.

విద్యావేత్తల ఆగ్రహం

గణితం, సైన్స్, సోషల్ సైన్స్, ఆర్ట్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఒకేషనల్ ఎడ్యుకేషన్ వంటి సబ్జెక్టుల కోసం ఎన్‌సిఇఆర్‌టి ఆంగ్లం, హిందీ, ఉర్దూ వెర్షన్లలో పుస్తకాలు ప్రచురించింది. లోగడ ఈ పుస్తకాలను ఏ భాషలో ప్రచురించారో దానికి అనుగుణంగానే సంప్రదాయబద్ధంగా పేర్లు పెట్టేవారని ఎన్‌సిఇఆర్‌టి రిటైర్డ్ ప్రొఫెసర్ ఒకరు తెలిపారు. ఉదాహరణకు గతంలో ఆరో తరగతి గణిత పుస్తకం ఆంగ్ల వర్షన్‌కు మాథమెటిక్స్ అని, హిందీలో గణిత్ అని, ఉర్దూ వర్షన్‌కు రియాజీ అని పేర్లు ఉండేవి. గత సంవత్సరం ఎన్‌సిఇఆర్‌టి హిందీ, ఆంగ్ల వర్షన్లకు 'గణిత ప్రకాష్' అనే పేరు పెట్టింది. 'సంప్రదాయాన్ని ఎన్‌సిఇఆర్‌టి మార్చేసింది. వారు ఏం సాధించాలని అనుకుంటున్నారో తెలియడం లేదు' అని ఆ రిటైర్డ్ ప్రొఫెసర్ చెప్పారు.

ఆంగ్లంలో రాసిన పుస్తకాలకు హిందీ పేర్లు పెట్టడం ఏమిటని 2006లో ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాల అభివృద్ధి బృందంలో సభ్యుడుగా పనిచేసిన ఢిల్లీ యూనివర్సిటీ హిస్టరీ ప్రొఫెసర్ అపూర్వానంద్ ప్రశ్నించారు. 'ఇది హిందీ వలసవాదం. ఎన్‌సిఇఆర్‌టి అసమంజసంగా వ్యవహరిస్తోంది. అది చేస్తున్న పనులను చూస్తుంటే తమిళనాడులో వ్యక్తమవుతున్న ఆందోళనలు సరైనవే అని స్పష్టమవుతోంది. హిందీయేతర భాషలు మాట్లాడే వారికి మోసపూరితంగా హిందీని నేర్పుతున్నారు' అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 'పుస్తకంలో విషయానికి అనుగుణంగా దాని టైటిల్ ఉండాలి. పూర్వి-సంతూర్ అనే పదాలకు, పుస్తకాలలోని విషయాలకు సంబంధమే లేదు. ఇది తప్పుదారి పట్టించడమే అవుతుంది' అని జెఎన్‌యుకు చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ అన్వితా అబ్బీ విమర్శించారు.

ఆ పుస్తకాలు బతికిపోయాయి

ఆరో తరగతి ఆంగ్ల భాషా పుస్తకానికి ముందుమాట రాసిన ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్ దినేష్ ప్రసాద్ సక్లానీ కానీ, పరిచయ వాక్యం రాసిన అకడమిక్ సమన్వయకర్త కీర్తి కపూర్ కానీ దానికి పూర్వి అనే హిందీ టైటిల్ ఎందుకు పెట్టారో చెప్పలేదు.

ముందుమాటలో పూర్వి అనే పదం ప్రాశస్త్యాన్ని సక్లానీ ఏకరువు పెట్టారు. ఎన్‌సిఇఆర్‌టికి చెందిన కొన్ని ఆంగ్ల మాధ్యమ పుస్తకాలు హిందీ దాడి నుండి తప్పించుకున్నాయి. ఆరో తరగతి కోసం కొత్తగా రూపొందించిన సైన్స్, సోషల్ సైన్స్ పుస్తకాల ఇంగ్లీష్ వర్షన్లకు ఆ భాషలోనే పేర్లు పెట్టారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని హడావిడిగా తరలిస్తున్న అధికారులు

గాజా ఆసుపత్రిపై ఇజ్రాయిల్ క్షిపణి దాడి

గాజా : గాజాలో శరణార్థి శిబిరాలు, ఆసుపత్రులపై అమానుష దాడులతో విరుచుపడుతున్న ఇజ్రాయిల్ తాజాగా మరో దాడికి తెగబడింది. ఆదివారం ఉదయం గాజాలోని ప్రధాన ఆసుపత్రి అల్-అహ్లీ అరబ్ బాప్టిస్ట్‌పై రెండు క్షిపణులను ప్రయోగించింది. ఈ క్షిపణులు అత్యవసర విభాగం, రిసెప్షన్‌ను ధ్వంసం చేశాయని, భవనంలో ఇతర నిర్మాణాలను దెబ్బతీశాయని వైద్యులు తెలిపారు. ఈ దాడి గురించి ముందస్తు సమాచారం ఉండటంతో అందులో ఉన్న రోగులను ముందుగానే ఖాళీచేయించారు. దాడికి కొన్ని నిమిషాల ముందు ఇజ్రాయిల్ భద్రతా సిబ్బందితో పరిచయం ఉన్న ఒక వ్యక్తి నుండి తమకు సమాచారం వచ్చిందని, దీంతో ఆస్పత్రి నుండి రోగులను ఖాళీ చేయించామని ఆరోగ్య అధికారులు తెలిపారు. కొందరు రోగులను ఆస్పత్రి బెడ్‌లపై నుండి తరలిస్తున్న దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ దాడులను హమాస్, ప్రభుత్వ మీడియా కార్యాలయం ఖండించాయి. గాజాలో వైద్యఆరోగ్య వ్యవస్థను ఇజ్రాయిల్ ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశాయి.

దాడిని ఖండించిన బ్రిటన్

గాజాలో ఆసుపత్రిపై ఇజ్రాయిల్ దాడిని బ్రిటన్ ఖండించింది. ఈ దాడిని బ్రిటన్ విదేశాంగ మంత్రి డేవిడ్ లామీ 'శోచనీయం' అని విమర్శించారు. 'వైద్య సౌకర్యాలపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులు గాజాలో ఆరోగ్య సంరక్షణ అందుబాటును పూర్తిగా దిగజార్చాయి' అని పేర్కొంటూ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. 'దాడులు ప్రారంభమైనప్పటి నుంచి అల్-అహ్లీ ఆసుపత్రిపై పదేపదే దాడులు జరుగుతున్నాయి. ఈ దారుణమైన దాడులు ముగించాలి. శాశ్వత శాంతిని సాధించడానికి దౌత్యమే మార్గం. రక్తపాతం కాదు' అని పోస్టులో పేర్కొన్నారు.

నియంతృత్వానికి తండ్రిలా బిజెపి : కపిల్ సిబాల్

న్యూఢిల్లీ : ప్రతిపక్షాన్ని అంతం చేసేందుకు మోడీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తోందని రాజ్యసభ ఎంపి కపిల్‌సిబాల్ విమర్శించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో స్థిరాస్తుల స్వాధీనం కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) నోటీసులు జారీ చేయడాన్ని రాజ్యాంగంపై దాడిగా పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బిజెపి నియంతృత్వానికి తండ్రిలా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి హిందూ -ముస్లిం ఎజెండాపై విభజన రాజకీయాలు చేస్తోందని, ప్రతిపక్షాలను అంతం చేయాలని చూస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ నియంత్రిస్తున్న నేషనల్ హెరాల్డ్ న్యూస్‌పేపర్ అండ్ ది అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఎజెఎల్)కి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో రూ.661 కోట్ల విలువైన స్థిరాస్తులను స్వాధీనం చేసుకోనున్నట్లు ఇడి శనివారం నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే.

బాణసంచా కేంద్రంలో పేలుడు

(మొదటి పేజీ తరువాయి)

మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. క్షతగాత్రులను, మృతుల కుటుంబాలను అనకాపల్లి ఎంపి సిఎం.రమేష్, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పరామర్శించారు.

ప్రమాదంపై చంద్రబాబు, పవన్, లోకేష్ దిగ్భ్రాంతి

ప్రమాద ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరుపుతామని తెలిపారు. ప్రమాద సమయంలో కర్మాగారంలో ఎంతమంది కార్మికులు ఉన్నారని, వారి పరిస్థితి ప్రస్తుతం ఎలా ఉందని అధికారులను ముఖ్యమంత్రి ఆరా తీశారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. కాగా కేంద్ర ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ. 2లక్షల చొప్పున పరిహారం ప్రకటించిందని రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత తెలిపారు.

వైసిపి నాయకులు అండగా నిలవాలి : వైఎస్ జగన్

మృతుల, గాయపడిన వారి కుటుంబాలకు వైసిపి నాయకులు అండగా ఉండాలని ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆదేశించారు. ఈ ప్రమాదంపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలు తిరిగి కోలుకునేలా అన్ని రకాలుగా ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలి : సిపిఎం

బాణసంచా తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనకాపల్లి జిల్లాలోని పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని, వీటిని అరికట్టడంలో ప్రభుత్వం, అధికారులు విఫలమవుతున్నట్లు పేర్కొన్నారు. బాణసంచా కేంద్రాల్లో లోపాలు ఉన్నచోట వెంటనే చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని తెలిపారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు సమగ్ర విచారణ జరిపించాలని, బాధిత కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పేలుడు ఘటన అందరినీ భయభ్రాంతులకు గురిచేసిందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని అరికట్టడంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం విఫలమవుతోందని పేర్కొన్నారు.

30 రోజుల్లో వెళ్లిపోండి

- లేకపోతే జరిమానా, జైలు
- విదేశీయులకు అమెరికా హెచ్చరిక

వాషింగ్టన్ : అమెరికాలో ఎక్కువకాలంగా నివసిస్తున్న విదేశీయులు తప్పనిసరిగా ప్రభుత్వం వద్ద రిజిస్టర్ చేసుకోవాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ హెచ్చరికలు జారీ చేసింది. "అమెరికాలో 30 రోజులకు మించి నివసిస్తున్న వారు కచ్చితంగా ఫెడరల్ గవర్నమెంట్ వద్ద రిజిస్టర్ చేయించుకోవాలి. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే.. నేరం కింద పరిగణించి అపరాధ రుసుం, జైలు శిక్ష విధిస్తారు. అందుకే ఇప్పుడే వెళ్లిపోండి" అని ఎక్స్‌లో సందేశం ఉంచింది.

సామాన్లు సర్దుకోండి..

"సొంతంగా అమెరికాను వీడటమే ఉత్తమమైన మార్గం. మీ సామాను సర్దుకొని విమానం ఎక్కండి. మీకు ఎటువంటి నేర నేపథ్యం లేకపోతే అమెరికాలో సంపాదించుకొన్న సొమ్మును దాచుకొని బయల్దేరండి" అని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ వెల్లడించింది. ఇలాంటి వారు విమాన టికెట్ సొమ్మును భరించలేకపోతే.. రాయితీ ఇచ్చేందుకు అమెరికా ఏర్పాట్లు చేసింది. ఈ నిబంధనలు పాటించకపోతే తక్షణమే దేశం నుంచి పంపిచేస్తామని పేర్కొంది. అంతేకాదు.. ఫైనల్ ఆర్డర్ అందుకొన్న వారు ఒక్క రోజు అధికంగా ఉంటే రోజుకు 998 డాలర్లు ఫైన్, సొంతంగా వెళ్లిపోకపోతే 1,000 నుంచి 5000 డాలర్ల ఫైన్ విధించనున్నారు. జైలు శిక్షను కూడా విధించే అవకాశం ఉందని. వారికి భవిష్యత్తులో చట్టపరమైన మార్గంలో కూడా అమెరికాలోకి ప్రవేశం లభించదని చెప్పింది.

షరతులు వర్తిస్తాయి..

ఈ నిర్ణయం హెచ్1 బి, విద్యార్థి పర్మిట్లపై ఉండేవారికి వర్తించదు. కానీ, సరైన అనుమతులు లేకుండా అమెరికాలో ఉండిపోయే వారిపై దీనిని అమలు చేయనున్నారు. ఎవరైనా హెచ్1బి వీసాపై వచ్చి ఉద్యోగం కోల్పోతే.. వారు నిర్ణీత సమయం దాటి అమెరికాలో ఉంటే చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. విద్యార్థి, హెచ్1బి వీసాదారులు అమెరికా చట్టాలు సూచించిన అన్ని నిబంధనలు కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది.

లాభార్జన కోసమే

- ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు ట్రంప్ మినహాయింపులపై ఆర్థిక సలహాదారు అక్షత్ శ్రీవాత్సవ

వాషింగ్టన్ : ప్రతి ఐఫోన్ అమ్మకం పైనా అమెరికాకు యాభై డాలర్ల లాభం వస్తుంది. అదే చైనాకు పది డాలర్లు మాత్రమే దక్కుతోంది. మిగిలిన 40 డాలర్లు ఇతర అంతర్జాతీయ సరఫరాదారుల ఖాతాల్లో చేరుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధించిన 125 శాతం సుంకాల జాబితా నుండి స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ పరికరాలను మినహాయించడానికి ఇదే ప్రధాన కారణమని విజ్‌డమ్ హచ్ వ్యవస్థాపకుడు, ఆర్థిక సలహాదారు అక్షత్ శ్రీవాత్సవ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఒక పోస్ట్ పెట్టారు. ఇది రక్షణాత్మక చర్య కాదని, లాభాలను దృష్టిలో పెట్టుకొనే ఈ నిర్ణయం తీసుకున్నారని ఆయన తెలిపారు. 'ప్రతి వ్యక్తి సొంత లాభం కోసమే పనిచేస్తారు. దీనికి ఓ కారణం ఉంది. విజేత మాత్రం పెటుబడిదారీ విధానమే. ఆర్థిక స్వీయ ప్రయోజనాలను కాపాడుకోవడం ఈ యుగం మనుగడ యొక్క స్వభావంగా ఉంది' అని వ్యాఖ్యానించారు. టారిఫ్‌లకు విరామం ప్రకటించడం వల్ల మార్కెట్లు శాంతిస్తాయని, ఈ నిర్ణయం స్వల్పకాలిక ర్యాలీకి ఆజ్యం పోస్తుందని శ్రీవాత్సవ తెలిపారు. ఒకే దేశంలో, ఒకే కరెన్సీలో వంద శాతం పెట్టుబడులు పెట్టడం విపత్తుకు సూచన అని ఆయన హెచ్చరించారు. అమెరికా ఈక్విటీలు, బంగారం, బిట్‌కాయిన్, అభివృద్ధి చెందుతున్న మార్కెట్లు, రియల్ ఎస్టేట్ వంటి రంగాలతోపాటు చైనాకు కూడా పెట్టుబడులు మళ్లించాలని సూచించారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందన్న భయాందోళనలను ఆయన తోసిపుచ్చారు. 'అమెరికా డాలర్ బలం తగ్గినప్పటికీ అది మరిన్ని డాలర్లను ముద్రించి ఆ ద్రవ్యోల్బణాన్ని ప్రపంచానికి ఎగుమతి చేయగలదు' అని అన్నారు.

త్వరలోనే యూనిట్లు ప్రారంభం : అమెరికా

సుంకాలలో ప్రకటించిన మినహాయింపులను బట్టి అమెరికా మెతక వైఖరిని అవలంబిస్తోందని భావించరాదని శ్వేతసౌధం డిప్యూటీ ప్రెస్ సెక్రటరీ కుష్ దేశాయ్ హెచ్చరించారు. కీలకమైన సెమీ కండక్టర్లు, చిప్‌లు, స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల ఉత్పత్తి విషయంలో చైనాపై ఆధారపడబోమని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆయా ఉత్పత్తులను తయారుచేసే కంపెనీలు త్వరలోనే అమెరికాలో యూనిట్లను ప్రారంభించాలని భావిస్తున్నాయని దేశాయ్ చెప్పారు.

'వక్ఫ్' నిరసనలపై లాఠీ

(మొదటి పేజీ తరువాయి)

భద్రతా దళం (బిఎస్ఎఫ్) ఆదివారం వెల్లడించింది. జిల్లాలో పరిస్థితిని నియంత్రించడానికి శనివారం వరకూ నాలుగు కంపెనీలను మోహరించామని, ఇప్పుడు అదనంగా మరో ఐదు కంపెనీలను తరలించామని బిఎస్ఎఫ్ డిఐజి, పిఆర్ఓ (పశ్చిమబెంగాల్ ఫ్రాంటియర్) నీలోత్పల్ కుమార్ పాండే మీడియాకు తెలిపారు.

మధ్యప్రదేశ్ మతఘర్షణల కేసులో తొమ్మిదిమంది అరెస్టు

మధ్యప్రదేశ్‌లోని గుణలో శనివారం జరిగిన మత ఘర్షణలకు సంబంధించిన కేసులో కాంగ్రెస్‌కు చెందిన వికీ పాంథన్ సహా తొమ్మిదిమందిని అరెస్టు చేసినట్లు గుణ అదనపు ఎస్‌పి ఆదివారం తెలిపారు. గుణలోని కల్నల్‌గంజ్ ప్రాంతంలో శనివారం రాత్రి హనుమాన్ జయంతి సందర్భంగా భారీ ఊరేగింపు నిర్వహించారు. మసీదు మీదుగా ఊరేగింపు వెళు న్నప్పుడు పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఆ సమయంలో మసీదు వద్ద ఉన్న వారు కూడా నినాదాలు చేయడంతో జరిగిన వాగ్వివాదం ఘర్షణలకు దారితీశాయి. 13 మంది గాయపడ్డారు. హిందూ సొసైటీ ఫిర్యాదు మేరకు 25 మందిపై కేసు నమోదు చేశామని, వారిలో తొమ్మిదిమందిని అరెస్టు చేశామని తెలిపారు. ఊరేగింపు కోసం ఎటువంటి అనుమతి తీసుకోలేదని చెప్పారు.

మతాన్ని పునాదిగా చేసుకునే ప్రభుత్వాల పతనం తప్పదు

(మొదటి పేజీ తరువాయి)

అడుగులకు మడుగులొత్తుతూ ఉప ముఖ్యమంత్రి సనాతన ధర్మం అంటూ కొత్త రాగం అందుకున్నారని చెప్పారు. ముఖ్యమంత్రికి, మంత్రులకు తెలియకుండానే దొంగ ఉత్తర్వులు వెలువడుతున్నాయని చెప్పారు. ఆ తరువాత ఉత్తర్వులు వెనక్కి తీసుకుంటున్నారని అన్నారు. పాలకులు రాజ్యాంగానికి కట్టుబడి ఉంటారా లేక రాజ్యాంగానికి వ్యతిరేకంగా మతోన్మాదానికి లొంగిపోయి లౌకిక వాదానికే ముప్పుతెస్తారా అనేది తేల్చుకోవాలన్నారు. టిడిపి, జనసేన, వైసిపి అందరూ లౌకికవాదం, మతసామరస్యానికి మద్దతుగా పోరాటానికి వీధుల్లోకి రావాలన్నారు. అప్పుడే ఆంధ్రప్రదేశ్ ఐక్యత, ప్రజాస్వామ్యం, మతసామరస్యం నిలబడతాయన్నారు. అమెరికా నుంచి భారతీయులను బేడీలు వేసి వెనక్కి పంపితే దేశభక్తి ఏమైందని ప్రశ్నించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. దేశంలో పురాతన కాలం నుంచి అనేక కులాలు, మతాల వారు కలిసి మెలిసి ఉండేవారన్నారు. ముస్లింల అభివృద్ధి, రక్షణకు వక్ఫ్ బోర్డు ఏర్పాటు చేశారని, మోడీ ప్రభుత్వం వక్ఫ్ బోర్డును నిర్వీర్యం చేయడం కోసం ప్రయత్నిస్తోందన్నారు. ఆ మసీదు కింద దేవాలయం ఉందని పిటిషన్లు వేసి మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని చెప్పారు. ఉత్తర భారతదేశంలో ఇటువంటి సంఘటనలు నిత్యకృత్యమయ్యాయని తెలిపారు. సొసైటీ ఫర్ కమ్యూనల్ హార్మొని జాతీయ ఉపాధ్యక్షులు కె విజయరావు మాట్లాడుతూ.. 1990లో దేశంలోని కొందరు ప్రముఖ వ్యక్తులు ఈ సంస్థను ఏర్పాటు చేశారని చెప్పారు. మత సామరస్యాన్ని పెంపొందించడమే దీని ముఖ్య లక్ష్యమన్నారు. కొందరు తప్పుడు సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం చేసి మత సామరస్యాన్ని విచ్ఛిన్నం చేస్తున్నారని చెప్పారు. పిఇడబ్ల్యూ సంస్థ పరిశోధనాత్మక నివేదికలో మత మార్పిడులు అధికంగా లేవని తేలిందన్నారు. ఈ కార్యక్రమంలో యుపి మాజీ మంత్రి మోయిన్ అహ్మద్, మాజీ ఎంపి, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు సయ్యద్ అజీజ్ పాషా, ఎపిసిసి అధికార ప్రతినిధి తులసి రెడ్డి, సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపల్ దివాకర్ బాబు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో 'హే రామ్ టు జై శ్రీరామ్' పుస్తకాన్ని ఎంపి ఇమ్రాన్ ప్రతాప్ ఘడి ఆవిష్కరించారు. ప్రముఖ జర్నలిస్ట్ ఆనంద్ వర్ధన్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, ఐలు నాయకులు సుంకర రాజేంద్రప్రసాద్, కాంగ్రెస్ నాయకులు మస్తాన్ వలీ, ముస్లిం జెఎసి నాయకులు అబ్దుల్ వహీం, మౌలానా సలా ఉద్దీన్, న్యాయవాదులు చలసాని విజయ్ కుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులు అశోక్, డివైఎఫ్ఐ నాయకులు సూర్యారావు, క్రాంతి కుమార్, రైతు సంఘం నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సిపిఐ నాయకులు అక్కినేని వనజ, ఐద్వా నేత శ్రీదేవి, మహిళా సమాఖ్య నాయకులు దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

మీకోసం



ఫ్రిజ్ నుంచి ఘాటైన వాసనలు రాకుండా ఉండాలంటే న్యూస్‌పేపరును నీళ్లల్లో ముంచి కాసేపు ఉంచాలి. ఆ తరువాత ఆ నీటిని పిండేసి, ఓ గిన్నెలో ఈ తడి కాగితాన్ని ఉంచి ఫ్రిజ్ లోపల పెడితే సరిపోతుంది.

జీవన సౌరభం

జీవితంలో ప్రతిరోజూ నిన్నటి కన్నా ఎక్కువ విషయాలు నేర్చుకుంటూ ఉండాలి.

JEEVANA జీవన the family

చందమామ

నింగిలోని చందమామ
నేలపైన జాబిలమ్మ

నింగిలో మబ్బుల చాటు దాగి
దోబూచులాడుతున్న చందమామ
వెదజల్లుతున్న వెన్నెలను ఆదమరచి
సొగసరి చుక్కలతో చేరి మైమరచి
ఆటలలో మునిగిపోయే

ఇంతలో నేలపై చిన్నారుల
కేరింతల సవ్వడి నింగి
అంచులను తాకి దద్దరిల్లె
ఆ సవ్వడికే ఉలిక్కిపడి
ఒకింత ఆశ్చర్యం వలకబోస్తూ
వంగి తొంగి చూసె
ఆ మామ కాని మామ

నేల పైన చిట్టి చిట్టి జాబిలమ్మలు
దొంగ పోలీస్ ఆడుతూ అచ్చం తనలాగే
దాక్కుంటు స్నేహితులతో చేరి
కవ్వింతలు కేరింతలతో
ఆటలు ఆడుతూ సందడి చేస్తుంటే
వారి చిరు ధరహాసాలతో
మరో వెన్నెల విరబూసిందక్కడ

ఆడి పాడి అలసిన ఆ పసివాళ్ళు
కునుకు రాగానే కూనలమ్మ రాగాలతో
చందమామ రావే.. జాబిల్లి రావే..
నిద్రపుచ్చగ రావే..
అంటూ జోల పాట పాడగా
అది వింటూ మురిసిపోతూ..
అలసిపోయి ఆదమరిచి
నిద్రలోకి జారుకుంది ఆ నెలరేడు

– నేదూరి భాను సాయి శ్రేయ,
నరసాపురం,
93924 67155.

దారి చూపండి



పిల్లలూ, బయట ఉన్న తాబేలు నీళ్ల మడుగులోకి వెళ్లాలి. దారి చూపి సాయం చేయరూ!

నేను గీసిన బొమ్మ

నునావత్ నిహారిక
8వ తరగతి,
జెడ్‌పిహెచ్ఎస్, నిజాంపేట,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

సీసాల్లో మొక్కలు

ఎండలు మండిపోతున్నాయి. వేడిగాలులతో ఫ్యాను వేసుకోవాలంటే భయం. కరెంటు బిల్లుతో ఏసీ ఆన్ చేయాలంటే గుబులు. ఇలాంటి పరిస్థితుల్లో మొక్కలు పెంచుకుంటే భలే ఉంటుంది అని చాలామంది అనుకుంటారు. అయితే నగరాల్లో అంత స్థలమున్న ఇళ్లు ఇప్పుడు ఎక్కడ ఉన్నాయి. మిద్దె తోట పెంచేవాళ్లని పక్కని పెడితే చిన్న చిన్న సందుల్లో, ఇరుకు గదుల్లో ఉండే వాళ్లకి అసలు మొక్కలు పెంచే అవకాశం లేదా? అంటే ఉంది అని చెప్పొచ్చు. ఈ వేసవిలోనే ఎంచక్కా మీ ఇంట్లో ఇలా ప్రయత్నించండి. ఫలితాలు ఎలా ఉన్నాయో చూడండి.

ఇంట్లో వాడిపారేసిన ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు మీ ఇంటి తోటకి బాగా ఉపయోగపడతాయి. వీటి కోసం ప్రత్యేకంగా స్థలం అవసరం లేదు. ఇంట్లో గోడకి కాస్త ఎండతగిలేలా ఉన్న చోట పెట్టుకుంటే చాలు. ఆ వెసులుబాటు కూడా లేకపోతే అడ్డంగా ఒక కర్రకి వ్రేలాడదీసుకోవచ్చు.

గోడకి లేదా కర్రకి మీకు నచ్చిన పద్ధతిలో వీటిని అమర్చుకొని ఆకుకూరలు, కాయగూరలు, పూల మొక్కలు వంటి వాటిని చక్కగా పెంచుకోవచ్చు.

ముందుగా వాటర్ బాటిళ్లని శుభ్రంగా కడగాలి. వాటిపై ఉన్న లేబుళ్లను కూడా తీసేయాలి. బాటిల్‌ని అడ్డంగా పడుకోబెట్టి ఒక వైపు కాస్తంత వెడల్పులో దీర్ఘచతురస్రాకారంగా కత్తిరించుకోవాలి. రెండవ భాగంలో మేకును వేడి చేసి చిన్న చిన్న రంధ్రాలు చేసుకోవాలి.

ఇలా తయారుచేసుకున్న సీసాలను తాళ్లతో గట్టిగా రెండుపక్కలా పట్టివుంచేలా కట్టుకోవాలి. అన్ని సీసాలు ఇలానే సిద్ధం చేసుకోవాలి. వీటిని మీకు నచ్చిన తీరుగా గోడకి లేదా కర్రకి సెట్ చేసుకోవాలి. తాళ్లని బలంగా కట్టడం మాత్రం మర్చిపోవద్దు.

ఇప్పుడు ఈ సీసాల్లో మట్టి పోయాలి. కాసిన్ని నీళ్లు పోసి మట్టిని తడపాలి. నీళ్లు ఎక్కువగా పోయకూడదని గుర్తుంచుకోవాలి. ఈ మట్టిలో విత్తనాలు వేసి, రోజుకు 3 లేదా 4 గంటలు సూర్యరశ్మి పడేలా చూడాలి.

ఇలా చేస్తే కొన్ని రోజులకే విత్తనాలు మొలకెత్తుతాయి. అందమైన పచ్చని తోట తయారవుతుంది. మొక్కలపై నుండి వచ్చే గాలి వేసవి తాపాన్ని తగ్గిస్తుంది. సెలవుల్లో ఇంటికే పరిమితమైన పిల్లలకు ఈ మొక్కల సంరక్షణ అప్పగించి చూడండి. పిల్లల్లో వచ్చిన మార్పు గమనించండి. ఒకే దెబ్బకి రెండు ప్రయోజనాలు అంటే ఇదేమరి!

సబ్జా నీళ్లు వేసవిలో మేలు

వేసవిలో డీ హైడ్రేషన్ గురికావడం వల్ల నీరసం వస్తుంది. త్వరగా అలిసిపోవడం, చికాకుగా అనిపిస్తుంది. ఇంకా అనేక చర్మ సమస్యలు, జుట్టు ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. ఈ సమస్యలన్నింటికీ సబ్జా గింజలు చక్కని పరిష్కారం చూపుతాయి. వీటిలో చాలా రకాల ప్రోటీన్స్ ఉన్నాయి.

- సబ్జా గింజల్లో ఆల్ఫా–లినోలెనిక్ యాసిడ్ పుష్కలంగా ఉంటుంది. ఫైబర్ వల్ల కడుపు నిండినట్లుగా అనిపిస్తుంది.
- సబ్జా గింజలను నిమ్మకాయ నీరు, షర్బత్, మిల్క్‌షేక్‌ల వంటి రిఫ్రెష్ డ్రింక్స్‌లలో వేసుకుని రోజుకు మూడు, నాలుగు గ్లాసులు తీసుకుంటే వడదెబ్బ నుంచి శరీరాన్ని కాపాడుకోవచ్చు.
- సబ్జా గింజల్లో పీచు ఎక్కువగా ఉండటం వల్ల మలబద్ధకం సమస్య నుంచి బయట పడొచ్చు. శరీరంలో ఉన్న వ్యర్థాలు కూడా బయటికి వెళ్లిపోతాయి. రక్తం శుద్ధి అవుతుంది. జీర్ణ సంబంధ సమస్యలైన కడుపు మంట, ఉబ్బరం, అసిడిటీ, అజీర్తి వంటి సమస్యలు తొలగిపోతాయి.
- సబ్జా గింజలను నూరి కొబ్బరి నూనెలో వేసి, ప్రభావిత ప్రాంతాలపై రాయడం వల్ల తామర, సోరియాసిస్ వంటి అనేక చర్మ వ్యాధుల చికిత్సకు సహాయ పడుతుంది.
- సబ్జా గింజలను నానబెట్టకుండా, నూరి ఒక కప్పు కొబ్బరి నూనెలో వేసి, కొన్ని నిమిషాలు పాటు వేడి చేసి అప్లై చేయాలి. చర్మం దెబ్బతిన్న చోట, కొత్త చర్మ కణాలను ఏర్పరుస్తుంది.
- సబ్జా గింజల్లో ఐరన్, విటమిన్ కె, ప్రోటీన్ ఉన్నాయి. ఇవి జుట్టుని బలంగా చేయడంలో తోడ్పడతాయి.
- చక్కెర వేయకుండా సబ్జా గింజల నీటిని తాగితే మధుమేహం అదుపులోకి వస్తుంది. రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలు తగ్గుతాయి.
- నానబెట్టిన సబ్జా గింజలను గ్లాసు పచ్చిపాలలో వేసుకొని, కొన్ని చుక్కల వెనిలా కలిపి తాగితే టైప్2 మధుమేహంతో బాధపడే వారికి ఉపశమనం కలుగుతుంది.
- సబ్జా గింజలలో యాంటిస్పాస్మోడిక్ ఉంటుంది. అంటే ఇవి స్పాస్మాటిక్ కండరాలలో ఉద్రిక్తతను తగ్గించి దగ్గును నియంత్రించడంలో సాయపడుతుంది. ఇవి రోగనిరోధక శక్తిని బలపరుస్తాయి.
- సబ్జా గింజల్లో ఉండే వైసెనిన్, ఓరింటిన్, బీటా కెరోటిన్ వంటి ఫ్లేవనాయిడ్స్ శరీర రక్షణ వ్యవస్థను బలపరుస్తాయి. కేవలం శరీరం లోపలి భాగాన్నే కాక బయట భాగాన్ని కూడా కాపాడటంలో ఇవి బాగా పనిచేస్తాయి.
- తలనొప్పి, మైగ్రేన్ లాంటి సమస్యలు ఉన్నవారు ఈ గింజల్ని నీళ్లలో కలుపుకొని తరుచూ తాగితే ఉపశమనం కలుగుతుంది.

నోటిలో అల్సర్లు రాకుండా..



నోటి లోపల చిన్న గాయం లేదా పుండ్ల రూపంలో కనిపించే మౌత్ అల్సర్లు చాలా మందిలో సాధారణంగా కనిపించే ఆరోగ్య సమస్య. తినే సమయంలో, మాట్లాడే సమయంలో ఇవి చాలా ఇబ్బందిగా అనిపిస్తాయి. కొన్ని సందర్భాల్లో తీవ్రమైన బాధను కలిగిస్తాయి. ఈ అల్సర్లకు కారణాలు ఎన్నో ఉంటాయి. అలాగే నివారణ, చికిత్స మార్గాలు కూడా అందుబాటులో ఉన్నాయి.

ఇవీ కారణాలు..

- మౌత్ అల్సర్లకు ముఖ్య కారణం మానసిక ఒత్తిడి. ఒత్తిడిలో ఉండే వ్యక్తులకు తరచుగా ఈ అల్సర్లు వస్తూ ఉంటాయి.
- విటమిన్ బి12, విటమిన్ సి, ఐరన్, ఫోలిక్ యాసిడ్ లోపం వల్ల కూడా నోటిలో పుండ్లు రావచ్చు.
- మసాలా పదార్థాలు, ఉప్పు ఎక్కువగా ఉన్న ఆహారం ఎక్కువగా తినడం వల్ల అల్సర్లు రావచ్చు.
- కొంతమంది మహిళల్లో నెలసరి సమయంలో హార్మోన్ల మార్పుల కారణంగా మౌత్ అల్సర్లు వస్తుంటాయి.
- కొన్ని మందులు మౌత్ అల్సర్లకు కారణం కావచ్చు.

ఉపశమనం ఇలా..

– ధ్యానం, యోగా వంటి పద్ధతుల ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించుకోండి.

- విటమిన్‌లు, మినరల్స్ పుష్కలంగా ఉండే పండ్లు, కూరగాయలు తీసుకోవాలి.
- మసాలా ఆహారాలు ఎక్కువగా తీసుకోకపోవడం మంచిది.
- ఫార్మసీలో దొరికే నోటి జెల్లు, మౌత్ వాష్‌లు ఉపయోగించి కూడా నోటి అల్సర్ల నుండి ఉపశమనం పొందవచ్చు. ఉదాహరణకు బెంజామిన్ పెరాక్సైడ్, ఓరల్ అనిసెప్టిక్ జెల్లును వాడుకోవచ్చు.
- కొద్దిగా సోడియం బైకార్బోనేట్‌ని(బేకింగ్ సోడా) నీటిలో కలిపి గార్గిల్ చేయడం వల్ల కూడా ఉపశమనం లభిస్తుంది.
- అలోవిరా జెల్‌ను అల్సర్ ఉన్న ప్రదేశంలో అప్లై చేసినా ఫలితం ఉంటుంది.
- మౌత్ అల్సర్లు 10 రోజులకంటే ఎక్కువగా ఉంటే డాక్టర్‌ను సంప్రదించాలి.

కొత్త సినిమాల్లో పాత జోడీలు

సినిమా హిట్టా...పట్టా అనేది కథ,కథనం, స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు ఇలా అన్ని అంశాలపై ఆధారపడి ఉంటుంది. వీటితోపాటుగా నటనలో కథానాయకుడు, కథానాయికల ఎంపికా కీలకమే. వారి ప్రతిభ కూడా సినిమా జయాపజయాలుపై ఆధారపడివుంటుంది. అందుకే దర్శక, నిర్మాతలు జాగ్రత్తలు తీసుకుంటుంటారు. కోస్టార్‌తో కెమిస్ట్రీ కుదిరితే ఇద్దరూ నటనలో ఆకట్టుకుంటారు. అందుకే రిపీట్ జోడీలను దర్శకులు ఎంపిక చేస్తుంటారు. నాడు–నేడు, పాత–కొత్తతరం నటీనటులు ఈ ఒరవడిని కొనసాగిస్తున్నారు. పాతతరంలో శ్రీదేవి, కృష్ణకుమారి, జమున, వాణిశ్రీ, జయసుధ, జయప్రదలతో ఎన్టీఆర్, ఎన్టీఆర్, కృష్ణ ఎక్కువ సినిమాల్లో నటించారు. ఆ తర్వాత కృష్ణంరాజు, శోభన్‌బాబు కూడా నటించారు. ఆ తర్వాత చిరంజీవి, బాలకృష్ణ రాధిక, రాధా, సుహాసిని, విజయశాంతిలతో నటించారు. వెండితెరపై హిట్ అయిన జోడీలను మళ్లీ మళ్లీ చూడాలని ప్రేక్షకులు కూడా కోరుకుంటారు. కథ కుదరటం, ఇద్దరి డేట్స్ సెట్ అయ్యి వెంటనే రిపీట్ అయిన జోడీలు చాలానే ఉన్నాయి. ఎన్నో ఏళ్లకు గానీ రిపీట్ అయ్యే జోడీలూ ఉన్నాయి. నందమూరి బాలకృష్ణతో విజయశాంతి, రమ్యకృష్ణ, సిమ్రాన్ ఎక్కువ సినిమాలు చేశారు. కెరీర్‌లో కొత్త హీరోయిన్లతో ఆయన జతకడుతున్నారు. అలా కొన్నేళ్ల తర్వాత రిపీట్ అవుతున్న జోడీల గురించి తెలుసుకుందాం.

దాదాపు పద్దెనిదేళ్ల తర్వాత హీరో హీరోయిన్లుగా చిరంజీవి, త్రిష స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు. వీరిద్దరూ కలిసి నటించిన తొలి సినిమా 'స్టాలిన్' 2006లో విడుదలైంది. ఆ తర్వాత మళ్లీ వీరిద్దరూ నటిస్తున్న చిత్రం 'విశ్వంభర'. బింబిసార ఫేమ్ వశిష్ఠ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. భీమవరం దొరబాబు పాత్రలో చిరంజీవి నటిస్తున్నారు. సిస్టర్ సెంటిమెంట్‌తోపాటు ఫ్యాంటసీ ఎలిమెంట్స్ కూడా ఈ కథలో ఉంటాయని సమాచారం.

రాజేంద్రప్రసాద్–అర్చన కలిసి నటించిన 'లేడీస్ టైలర్' చిత్రం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. 1986లో విడుదలైన ఈ రొమాంటిక్ కామెడీ ఫిల్మ్ తర్వాత మళ్లీ మరో సినిమా చేయలేదు. 38 ఏళ్ల తర్వాత ఇప్పుడు 'షష్ఠిపూర్తి' చిత్రంలో కలిసి నటిస్తున్నారు. వీరితోపాటుగా రూపేష్, ఆకాంక్షసింగ్ లీడ్‌రోల్స్‌లో, అచ్యుత్‌కుమార్, శకుంతల కీలకపాత్రల్లో నటిస్తున్నారు. పవన్‌ప్రభ దర్శకత్వం వహిస్తున్నారు. లేడీస్‌టైలర్, షష్ఠిపూర్తి సినిమాలకు ఇళయరాజా సంగీతాన్ని అందించారు. కుటుంబ విలువలు, అనుబంధాల నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపేష్ నిర్మించారు.

మలయాళ సిల్వర్ స్క్రీన్‌పై మోహన్‌లాల్, శోభనల జోడీ సూపర్‌హిట్. 'ఆవిడతే పోలే ఇవిడెయుమ్' (1985) సినిమాలో మొదటిసారి వీరిద్దరూ జతకట్టారు. ఆ తర్వాత మణిచిత్ర తాళు, నాడోడిక్కట్టు వంటి హిట్ సినిమాలు 50కిపైగా స్క్రీన్ షేర్ చేసుకున్నారు. 1994లో విడుదలైన మలయాళ చిత్రం 'తేన్మావిన్ కొంబాట్'లోనూ నటించారు. మోహన్‌లాల్ 360వ చిత్రంలో శోభన కలిసి నటించిన చిత్రం 56వది.

దాదాపు పాతికేళ్ల క్రితం తమిళ చిత్రం 'పూవెల్లామ్ కేట్టుప్పార్' (1999)లో తొలిసారి సిల్వర్‌స్క్రీన్‌పై సూర్య, జ్యోతిక కనిపించారు. ఆ తర్వాత 'ఉయిరిలే కలందదు, పేరళగన్, కాక్క కక్క, మాయావి వంటి సినిమాల్లో నటించి హిట్ జోడీగా నిలిచారు. 2006లో 'సిల్లున్ను ఒరు కాదల్' సినిమాలో నటించారు. విడుదలైన తర్వాత రియల్‌లైఫ్ జోడీ కూడా అయ్యారు. 18 సంవత్సరాల తర్వాత అంజలీమీనన్ దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నారు.

రామ్‌చరణ్–కియారా అద్వానీ కలిసి నటించిన చిత్రం 'వినయ విధేయ రామ'. గేమ్‌ఛేంజర్‌లోనూ వీరిద్దరూ కలిసి నటించారు. 'లవ్‌స్టోరీ'లో నటించిన నాగచైతన్య–సాయిపల్లవి జంట 'తండేల్' బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచాయి. 'వెంకీమామ'లో నాగచైతన్య, రాశీఖన్నా జంట 'థ్యాంక్యూ'తో మెప్పించింది. నాని–కీర్తిసురేష్ 'నేను లోకల్' సినిమాతో జంటగా నిలిచి 'దసరా'తో బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టారు. ఖుషీతో జట్టు కట్టిన విజయ్‌దేవరకొండ–సమంత 'మహానటి'తో అలరించారు.

సీనియర్ కథానాయికుల హవా...

కథానాయిక త్రిష అజిత్ సరసర 'విడాముయర్చి', మోహన్‌లాల్‌తో 'రామ్', కమల్‌హాసన్‌తో 'థగ్‌లైఫ్', టొవినో థామస్‌తో 'ఐడెంటిటీ' చిత్రాల్లో నటిస్తున్నారు. పెళ్లి తర్వాత వరుస సినిమాలతో నయనతార దూసుకెళ్తున్నారు. షారూక్‌ఖాన్ సరసర 'జవాన్'లో నటించగా ఘన విజయాన్ని అందుకుంది. ఆ తర్వాత ఇరైవన్, అన్నపూరణిలతో అలరించారు. నయనతార, మాధవన్, సిద్ధార్థ్ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'టెస్ట్'. 2005లో తెరంగ్రేటం చేసిన తమన్నా సినిమాలతోనే కాకుండా వెబ్‌సిరీస్‌లతోనూ అలరిస్తున్నారు. భోళాశంకర్, బాంద్రా, జీ కర్దా, అఖిరీ సచ్ వెబ్‌సిరీస్‌లలో మెప్పించారు. 'బాక్' చిత్రం అలరించింది. కాజల్ అగర్వాల్ 'భగవంత్‌కేసరి'లో బాలకృష్ణతో కలిసి పనిచేశారు. భారతీయుడు 2లో కమల్‌హాసన్‌తో కలిసి నటించారు.

సత్యభామతో అలరించారు. అనుష్కశెట్టి 2020లో వచ్చిన 'నిశ్శబ్దం' తర్వాత 'మిస్‌శెట్టి మిస్టర్ పోలిశెట్టి'లో నటించారు. అనుష్కశెట్టి 2020లో వచ్చిన 'నిశ్శబ్దం' తర్వాత మూడేళ్లపాటు గ్యాప్ తీసుకున్నారు. నవీన్‌పోలిశెట్టితో కలిసి 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి'లో నటించారు. క్రిష్ దర్శకత్వంలో 'ఘాటి', మలయాళంలో రోజిన్ థామస్ డైరెక్షన్‌లో 'కథనార్'లో నటించారు. నాగార్జునతో కలిసి పలు సినిమాల్లో నటించిన రమ్యకృష్ణ 'బంగార్రాజు'తో సరికొత్త హిట్‌ను అందుకున్నారు. కొడుకులు దిద్దిన కాపురంలో సీనియర్ నటుడు కృష్ణతో కలిసి నటించిన విజయశాంతి ఆయన తనయుడుతో కలిసి 'సరిలేరు నీకెవ్వరు' సినిమాలో నటించారు. నందమూరి కళ్యాణ్‌రామ్‌తో కలిసి 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి సినిమాలో తల్లిగా నటించారు. 22 సంవత్సరాల తర్వాత ఆమె వెండితెరపై మెరుస్తున్నారు.

సురేఖ జోడీకి పసిడి

న్యూఢిల్లీ: తెలుగు ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ అంతర్జాతీయ వేదికపై మరోసారి సత్తా చాటింది. అమెరికాలోని సెంట్రల్ ఫ్లోరిడాలో జరుగుతున్న ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్ 1 పోటీల్లో రిషభ్ యాదవ్‌తో కలిసి కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణ పతకం కొల్లగొట్టింది. ఫైనల్లో సురేఖ–రిషభ్ జోడీ 153–151తో చైనీస్ తైపీ ద్వయం హువాంగ్ జో – చెన్ చి లున్‌పై విజయం సాధించింది. ఇప్పుడు సురేఖ గెలిచిన కాంపౌండ్ మిక్స్‌డ్ ఈవెంట్‌నే 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో ప్రవేశపెడుతున్నట్లు ఇటీవల అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఒసీ) ప్రకటించిన సంగతి తెలిసిందే. అలాగే, విజయవాడ ఆర్చర్ సురేఖకు ప్రపంచ కప్‌లో ఇది 11వ పసిడి పతకం.

అదరగొట్టిన కోహ్లి, సాల్ట్

రాజస్థాన్‌పై బెంగళూర్ గెలుపు • ఛేదనలో విరాట్ అర్ధ సెంచరీ

ప్రత్యర్థి సొంత గడ్డపై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూర్ జైత్రయాత్ర కొనసాగుతుంది. ఈడెన్, చెపాక్, వాంఖడెలో జయభేరి మోగించిన బెంగళూర్ తాజాగా జైపూర్ కోటను బద్దలు కొట్టింది. రాజస్థాన్ రాయల్స్‌పై 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఫిల్ సాల్ట్ (65), విరాట్ కోహ్లి (62 నాటౌట్) అర్ధ సెంచరీలతో 174 పరుగుల లక్ష్యాన్ని ఆర్‌సీబీ 17.3 ఓవర్లలోనే ఊదేసింది. ఐపిఎల్18లో రాయల్స్‌కు ఇది నాల్గో ఓటమి కాగా, రాయల్ చాలెంజర్స్‌కు ఇది నాల్గో విజయం.

జైపూర్ : ఫిల్ సాల్ట్ (65, 33 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్సులు), విరాట్ కోహ్లి (62 నాటౌట్, 45 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సులు) అర్ధ సెంచరీలతో కదం తొక్కారు. యువ ఆటగాడు దేవదత్ పడిక్కల్ (40 నాటౌట్, 28 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) సైతం రాణించటంతో ఆదివారం జైపూర్‌లో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 174 పరుగుల లక్ష్యాన్ని బెంగళూర్ 17.3 ఓవర్లలోనే ఛేదించింది. అంతకుముందు, యశస్వి జైస్వాల్ (75, 47 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సులు) అర్ధ సెంచరీ సాధించటంతో తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 173 పరుగులు చేసింది. ఛేదనలో దంచికొట్టిన బెంగళూర్ ఓపెనర్ ఫిల్ సాల్ట్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. ఐపీఎల్18లో ఆరు మ్యాచుల్లో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌కు ఇది నాలుగో విజయం కాగా.. రాజస్థాన్ రాయల్స్‌కు ఆరు మ్యాచుల్లో ఇది నాలుగో పరాజయం. ఈ విజయంతో పాయింట్ల పట్టికలో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ మూడో స్థానానికి ఎగబాకింది.

సంక్షిప్త స్కోరు వివరాలు :

రాజస్థాన్ రాయల్స్ ఇన్నింగ్స్ : 173/4 (యశస్వి జైస్వాల్ 75, ధ్రువ్ జురెల్ 35, రియాన్ పరాగ్ 30, కృనాల్ పాండ్య 1/29, భువనేశ్వర్ కుమార్ 1/32)

రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ ఇన్నింగ్స్ : 175/1 (ఫిల్ సాల్ట్ 65, విరాట్ కోహ్లి 62 నాటౌట్, దేవదత్ పడిక్కల్ 40 నాటౌట్, కుమార్ కార్తికేయ 1/25)

ఢిల్లీ క్యాపిటల్స్ రనౌట్!

కరుణ్ పోరాటం వృథా
12 పరుగులతో ముంబయి విజయం

న్యూఢిల్లీ : 12 బంతుల్లో 23 పరుగులు. ముంబయిపై విజయానికి ఢిల్లీ క్యాపిటల్స్ సమీకరణ ఇది. క్రీజులో సూపర్ ఫామ్‌లో ఉన్న ఆషుతోశ్ శర్మ. బుమ్రాపై వరుస బౌండరీలు బాదిన ఆషుతోశ్ (17) జోరు మీదున్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్ విజయానికి మరో 15 పరుగుల దూరంలో నిలువగా.. హ్యాట్రిక్ రనౌట్లు ఆ జట్టును దెబ్బతీశాయి. ఆషుతోశ్, కుల్దీప్ యాదవ్ (1), మోహిత్ శర్మ (0) వరుస బంతుల్లో రనౌట్‌గా నిష్క్రమించారు. దీంతో 18.5 ఓవర్లలో ఢిల్లీ క్యాపిటల్స్ 193 పరుగులకే కుప్పకూలింది. కరుణ్ నాయర్ (89, 40 బంతుల్లో 12 ఫోర్లు, 5 సిక్సులు) ధనాధన్ అర్ధ సెంచరీకి తోడు అభిషేక్ పోరెల్ (33, 25 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) మెరవటంతో 119/1తో ఢిల్లీ క్యాపిటల్స్ పటిష్ట స్థితిలో నిలిచింది. కానీ మిడిల్ ఆర్డర్‌లో కెఎల్ రాహుల్ (15), అక్షర్ పటేల్ (9), ట్రిస్టన్ స్టబ్స్ (1), విప్‌రాజ్ నిగమ్ (14) నిరాశపరిచారు. చేజారిందనుకున్న మ్యాచ్‌లో మెరుపు విజయం సాధించిన ముంబయి ఇండియన్స్ వరుస పరాజయాల నుంచి బయటపడింది. అంతకుముందు తిలక్ వర్మ (59) అర్ధ సెంచరీతో ముంబయి ఇండియన్స్ తొలుత 205 పరుగుల భారీ స్కోరు సాధించింది.

తిలక్ వర్మ జోరు : తెలుగు తేజం తిలక్ వర్మ (59, 33 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సులు) ధనాధన్ అర్ధ సెంచరీతో చెలరేగాడు. అరడజను ఫోర్లు, మూడు సిక్సర్లతో కదం తొక్కిన తిలక్ వర్మ తొలి నుంచే ఎదురుదాడి చేశాడు. టాప్, మిడిల్ ఆర్డర్‌లో కీలక భాగస్వామ్యాలు నిర్మించిన తిలక్ వర్మ ముంబయి ఇండియన్స్‌కు 205 పరుగుల భారీ స్కోరు అందించాడు. పవర్‌ప్లేలో 59/1తో నిలిచిన ముంబయిని తిలక్ వర్మ నిలబెట్టాడు. ఐదు ఫోర్లు, మూడు సిక్సర్లతో 26 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించి అదరగొట్టాడు. ఓపెనర్లు రోహిత్ శర్మ (18), రియాన్ రికెల్టన్ (41) శుభారంభం అందించారు. దూకుడుగా ఆడే ప్రయత్నంలో రోహిత్ నిష్క్రమించినా.. రికెల్టన్ జోరు కొనసాగించాడు. సూర్యకుమార్ యాదవ్ (40) మరోసారి మంచి ఆరంభాన్ని భారీ స్కోరుగా మలచలేకపోయాడు. కెప్టెన్ హార్దిక్ పాండ్య (2) నిరాశపరిచాడు. ఆఖర్లో నమన్ దిర్ (38 నాటౌట్, 17 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులు) వేగంగా పరుగులు చేశాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68